ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 21 జూలై 2025



బాపట్ల మండలం వెదుళ్లపల్లిలో ఇసుకను విచ్చలవిడిగా తవ్వేయటంతో ఏర్పడిన గుంతలు

ఆగని గ్రానైట్ దందా

- జీరో బిల్లులతో అక్రమ రవాణా
- నాడు ఆందోళనలు.. నేడు నేతల అండ
- గత ప్రభుత్వ తరహాలోనే అడ్డగోలు దోపిడీ
- వాటాల్లో తేడాలు.. ఆధిపత్య పోరుతోనే లారీల పట్టివేత

గత ఐదేళ్ల వైసీపీ హయాంలో యథేచ్ఛగా గ్రానైట్ దందా సాగింది. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ఈ దందాపై ఎడతెగని పోరాటమే చేసింది. ప్రభుత్వం మారి అధికారం టీడీపీ చేతికొచ్చింది. కానీ ఈ గ్రానైట్ దందాలో మాత్రం మార్పు రాలేదు. పైగా ఇది మరో స్థాయికి చేరుకుంది. అప్పుడు పెడబొబ్బలు పెట్టిన నేతల అనుయాయులే ఇప్పుడు సూత్రధారులయ్యారు. ప్రైవేట్ సైన్యం కూడా సేమ్ టూ సేమ్.

(బాపట్ల, మార్టూరు, దాచేపల్లి - ఆంధ్రజ్యోతి)

గ్రానైట్‌ను అడ్డం పెట్టుకుని అడగోలుగా ఎంత సంపాదించ వచ్చో అప్పటి నేతలు దారి చూపగా, దానిని అందిపుచ్చుకున్న ప్రస్తుత నేతలు ఇప్పుడూ అదేమార్గంలో దూసుకెళుతున్నారు. మైనింగ్, రెవెన్యూతో పాటు వాణిజ్య పన్నుల శాఖ అధికారుల పాత్ర ఈ అడ్డగోలు దందాలో ఉండగా, కీలకపాత్ర మాత్రం అధికార పార్టీ నేతల అనుచరులదే అన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

బాపట్ల జిల్లాలోని మార్టూరు, సంతమాగులూరు, బల్లికురవ మండలాల నుంచి గ్రానైట్ పలకలతో పాటు ముడిసరుకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. బాపట్ల జిల్లా నుంచి పల్నాడు జిల్లా మీదగా తెలంగాణలోకి ప్రవేశించాల్సి ఉంది. ఈ క్రమంలో మైనింగ్ సీనరేజ్‌కు సంబంధించి ఓ ప్రైవేటు ఏజెన్సీ వసూళ్ల టెండర్ గత ప్రభుత్వంలోనే దక్కించుకుంది. అనధికారిక రవాణా విషయంలో ఈ సంస్థ ఇచ్చే టోకెన్ కూడా సరిహద్దుల దగ్గర పనిచేస్తున్నాయని సమాచారం. ఇది కాకుండా జీఎస్టీ కూడా గ్రానైట్ వ్యాపారులు చెల్లించాలి. ఒక్కో లారీకి సుమారు రూ.70,000 నుంచి లక్ష వరకు వివిధ రూపాలలో ప్రభుత్వానికి ఆదాయం లభించే అవకాశం ఉంది. కానీ నిబంధనలకు పాతరేసి లారీకి రూ.35,000 నుంచి రూ.45,000 కప్పం చెల్లిస్తే చాలు దర్జాగా సరిహద్దులు దాటిస్తున్నారు. అలా వసూలు చేసిన మొత్తాల్లోనే కాంట్రాక్టు దక్కించుకున్న ఏజెన్సీకి కొంత, వ్యవస్థలకు కొంత, సింహభాగం మాత్రం అధికార పార్టీ నేతల అనుచరగణానికే. ఈ అడ్డగోలు దందాలకు ఆపితే ప్రభుత్వ ఖజానాకు నెలకు అక్షరాల పది కోట్లు ఆదాయం సమకూరుతుంది.



లారీల్లో ఉన్న గ్రానైట్ రాళ్ళు



గ్రానైట్ అక్రమ రవాణా చేస్తూ మార్టూరులో పట్టుబడిన లారీలు (ఫైల్ ఫొటో)

ఆధిపత్యపోరుతోనే..

పన్నులు చెల్లించకుండా మార్టూరు ప్రాంతం నుంచి ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్న 11 గ్రానైట్ లారీలను జూన్ 24న పల్నాడు జిల్లాలోని సరిహద్దుల వద్ద వాణిజ్య పన్నుల శాఖ అధికారులు పట్టుకున్నారు. శనివారం పల్నాడు జిల్లా తంగెడ వద్ద మరో 14 లారీలను పట్టుకున్నారు. లారీలను పట్టుకున్న అధికారులపై ప్రైవేటు సైన్యం వాగ్వాదానికి దిగిందనే ప్రచారం ఉంది. ఈ రెండు ఉదంతాలకు సంబంధించే జరిమానా రూపంలో ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.60 లక్షలకు పైగా జమైంది. దీనిని బట్టి గ్రానైట్ రవాణాలో మాఫియా పాత్ర లేకపోతే ప్రభుత్వ ఖజానాకు కాసుల గలగలే. ఈ మొక్కుబడి పట్టివేతలు ఆధిపత్య పోరులో భాగంగానే అనే ప్రచారం జోరుగా నడుస్తోంది. వాటాల పంపకాలలో నేతల అనుచరుల మధ్య వచ్చిన తేడాల్లో భాగంగానే తమ పరిధిలో ఉన్న అధికారులను ప్రయోగించి దారికి తెచ్చుకునే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా జరుగుతోందని గ్రానైట్ వ్యాపారులు చెబుతున్నారు.

కాదేదీ తవ్వకానికి అనర్హం!

- బాపట్లలో అడ్డగోలుగా ఇసుక, మట్టి తవ్వకాలు
- మెరక సాకుతో సాగు భూములనూ వదలని వైనం

బాపట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన బాపట్ల నియోజకవర్గంలో ఇసుక, మట్టి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గోరంత అనుమతితో కొండంత మట్టి తవ్వి తరలిస్తున్నారు. మెరకలు తీస్తున్నామనే సాకుతో.. ప్రొక్లెయినర్లతో వ్యవసాయ భూములను సైతం అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక, మట్టి మాఫియా రెచ్చిపోతున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం పట్టించుకోవటం లేదనే విమర్శలు పెద్దఎత్తున వస్తున్నాయి. పొలాల నుంచి రైతులు మరమ్మతుల నిమిత్తం.. ఒక ట్రాక్టర్ మట్టి తీసుకొస్తే నేరంగా పరిగణించే అధికారులు.. ఈ విధంగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నా తమకేమి తెలియదన్నట్లు చోద్యం చూస్తున్నారు. బాపట్ల మండలంలోని వెదుళ్లపల్లి, దరివాదకొత్తపాలెం, స్టూవర్టుపురం, బేతపూడి పరిసర ప్రాంతాల్లోని అసైన్డ్ భూముల్లో అక్రమ తవ్వకాలు పరిపాటిగా మారాయి. కొంతమంది ఫిల్లింగ్ శాండ్ విక్రయిస్తుండగా.. మరికొందరు కట్టుబడి ఇసుక విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన ఈ అక్రమ ఇసుక తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. వందలాది ఎకరాల లేఅవుట్‌లు మెరక చేయడానికి కాంట్రాక్ట్ పద్ధతిన ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. కర్లపాలెం మండలంలోని బుద్దాం, యాజలి గ్రామాల్లో నల్లమట్టి, పేరలి, తుమ్మలపల్లి పరిసర ప్రాంతాల్లో బుసక ఇసుక తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం ఈ ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. పిట్టలవానిపాలెం మండలం గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని దివాన్‌తోట ఎస్టీ కాలనీ సమీపంలో పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నిత్యం వందలాది ట్రాక్టర్‌ల బుసుక ఇసుక తరలిస్తున్నారు. ఈ తవ్వకాలపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే పొలాలు కాస్త చెరువులుగా మారే ప్రమాదం ఉంది.



కర్లపాలెంలో తవ్విన మట్టిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

బర్లీ కొనుగోళ్లు.. సెప్టెంబరు వరకు

రెండు నెలలు అందుబాటులో కేంద్రాలు

అధికారులకు సమాచారం ఇచ్చిన మార్క్‌ఫెడ్

గుంటూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద మిగిలిపోయిన హెచ్‌డీ నల్లబర్లీ పొగాకుని సెప్టెంబరు నెల వరకు కొనుగోలు చేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ నిర్ణయించింది. ఈ మేరకు ఆదివారం ఆ శాఖ నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో మరో రెండు నెలలకు పైగానే మార్క్‌ఫెడ్ ప్రారంభించిన పొగాకు కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉంటాయని అధికారవర్గాలు తెలిపాయి. ఈ దృష్ట్యా పొగాకు రైతులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పేర్లను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుని ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కేంద్రాలకు తీసుకొచ్చి పొగాకుని విక్రయించుకోవాలని సూచించాయి. కేంద్రం నుంచి సహకారం లేకపోయినా బర్లీ పొగాకు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.270 కోట్లు విడుదల చేసింది. అయితే వివిధ కారణాలతో ఇప్పటివరకు కేవలం రూ.44 కోట్ల పొగాకును మా త్రమే కొనుగోలు చేశారు. ఇంకా రైతుల వద్ద భారీ మోతాదులో పొగాకు నిల్వలున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోళ్ల వ్యవధిని సెప్టెంబరు బరకు పొడిగిస్తూ మార్క్‌ఫెడ్ నిర్ణయం తీసుకు న్నది. రైతులు తేమ 20 శాతం లోపు ఉన్న బేళ్లను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురా వాలని స్పష్టం చేసింది. ఇందుకోసం ఒక రోజు ముందుగానే తమ బేళ్లను తనిఖీ చేయించుకోవాలని సూచించింది.

తిరస్కరించే బేళ్లు

నల్ల బొగులు, పచ్చగొగులు, పండుగుల్ల, ధ్వంసమైన బేళ్లను మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో అనుమతించమని ఆ శాఖ అధికారులు తెలిపారు. రైతులకు అనుకూలంగా కొనుగోలు ప్రక్రియ సులభతరంగా జరిగేలా సీఎంయాప్, ఏపీఏఐఎంఎస్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫాంలను సంస్థ నిర్వహిస్తుందని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే రైతులు మార్క్‌ఫెడ్/వ్యవసాయ అధికారులను సంప్రదించొచ్చని సూచించారు.



జిల్లాలో కుండపోత వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం

బాపట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుండపోత వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి కారుమబ్బులు కమ్ముకుని విడతల వారీగా వర్షం కురిసింది. సాయంత్రానికి భారీవర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలతో పాటు, వివిధ రోడ్లపై నీరు నిలిచింది. ప్రధాన రహదార్లపై కూడా వర్షపునీరు నిలిచింది. బాపట్లలో రెండుగంటలపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీవర్షంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. బాపట్లలోని ప్రధాన రహదార్లపై కూడా వర్షం నీరు భారీగా నిలిచింది. ఇంజనీరింగ్ కళాశాల నుంచి నందిరాజుతోట వరకు ప్రధాన రహదారిపై అనేకచోట్ల తటాకాలను తలపించేలా నీరు నిలిచింది.



బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

రైతుల్లో హర్షం


భారీ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వెద సాగు చేస్తున్న పొలాలకు నీరు పెట్టేందుకు తిప్పలు పడుతున్న తరుణంలో వర్షం పడిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వర్షం పొలాలకు మేలు చేస్తుందని, మొలకెత్తిన పైరు పైకి ఎదుగుతుందన్నారు. కూరగాయలు, ఆకుకూరలు బెట్టకొచ్చిన సమయంలో వర్షం మేలు జరుగుతుందని సాగుదారులు తెలిపారు. బాపట్లతోపాటు చీరాల, పర్చూరు, రేపల్లె నియోజకవర్గాలలో కూడా వర్షం కురిసింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ సహాయకులు కె.శ్రీనివాసరావు, నాగుల శ్రీనివాసరావు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరవళ్లు.. నారుమళ్లు!



కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆల్మట్టి నుంచి నాగార్జున సాగర్ వరకు అన్ని జలాశయాలకు వరద ఉధృతి కొనసాగుతోంది. ఆదివారం సాగర్ జలాశయం నీటి మట్టం 567 అడుగులకు చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో మరో వారం రోజుల్లో డ్యాం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో పది రోజుల్లో సాగర్ కుడి కాల్వకు సాగు నీటి సరఫరాకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. సాగు నీటి విడుదల సమాచారం అన్నదాతల్లో ఆనందాన్ని నింపింది. దీంతో వరి నారు మళ్లు పోసే పనిలో నిమగ్నమయ్యారు.

- కొనసాగుతున్న కృష్ణాదిలో వరద ప్రవాహం
- నిండుకుంటున్న జలాశయాలు
- 567 అడుగులకు చేరిన సాగర్ డ్యాం నీటి మట్టం
- పది రోజుల్లో కుడి కాల్వకు సాగు నీటి విడుదల
- వరి సాగుకు అన్నదాతలు సమాయత్తం
- నీటి వనరుల ప్రాంతాల్లో వరి నారుమళ్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చెరువులు, వాగులు, బావులు, మోటార్లు ఇలా నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో రైతులు వరి నారు మళ్లు పోస్తున్నారు. కాలువకు నీటిని విడుదల చేసిన వెంటనే నాట్లు వేసేలా సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎక్కువ శాతం మంది రైతులు వరి విత్తనాలు కొనుగోలు చేశారు.

నిండుకుంటున్న సాగర్ జలాశయం

సాగర్ జలాశయానికి 67,525 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. శ్రీశైలం జలాశయానికి.. వరద ప్రవాహం పెరిగింది. 1,56,516 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో సాగర్‌కు శ్రీశైలం నుంచి నీటి విడుదల పెంచనున్నారు. ఇదే తరహాలో నీటి ప్రవాహం కొనసాగుతుందని జలవనరుల (మిగతా 7లో)



వరినారుకు విత్తనాలు చల్లుతున్న రైతులు



నిండు కుండలా సాగర్ జలాశయం

జగన్ ఆలోచనలు సమాజానికి ప్రమాదకరం

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

7

మద్యం కేసులో తిమింగలానికి త్వరలో శిక్ష : జీవీ

ఖాకీల తక్షణ స్పందన తల్లీకూతుళ్లను కాపాడింది

జెడ్పీ ఫైల్స్!

నాకేంటి.. ఆహా నాకేంటి అంట. ఇదీ బిల్లుల చెల్లింపు సమయంలో.. కాంట్రాక్టర్లకు జిల్లా పరిషత్ అధికారుల నుంచి వస్తున్న ప్రశ్న. పర్సంటేజీలు తేలందే.. కొన్ని ఫైల్స్ ముందుకు కదలడం లేదన్న విమర్శలు జడ్పీలో ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి పథకం కింద స్టడీమెటీరియల్ అందజేసిన కాంట్రాక్టర్‌ను చూపుతున్నారు. తొమ్మిది నెలలు దాటినా సదరు గుత్తేదారును కీలక అధికారి బిల్లుల చెల్లింపు విషయంలో వేధింపులకు గురిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. పర్సంటేజీ తేలందే ఫైల్ ముందుకు కదలదని ఉన్నతాధికారి భీష్మించు కున్నట్లు చర్చ నడుస్తోంది.

- బిల్లుల చెల్లింపుల్లో మీన మేషాలు
- చర్చనీయాంశంగా 'విద్యాజ్యోతి' బిల్లుల చెల్లింపు
- 9 నెలల నుంచి రూ.80 లక్షల ఫైల్ పెండింగ్
- పర్సంటేజీ తేలందే ముందుకు కదలని వైనం?

గుంటూరు సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్‌లో ఏమి జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. కొన్ని ఫైల్స్‌ను కీలక అధికారులు అర్థంత రంగా తొక్కి పెడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక్కో ఫైల్‌ను నెలల తరబడి పెండింగ్‌లో పెడుతూ ఉండడం అత్యంత వివాదాస్పదమవుతోంది.తాజాగా విద్యాజ్యోతి పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు పుస్తకాలు పంపిణీ చేసిన కాంట్రాక్టర్‌కు సుదీర్ఘ కాలం బిల్లులు చెల్లించని వైనంపై దుమారం రేగుతోంది. తొమ్మిది నెలలు గడచినా.. కీలక అధికారి మీనమేషాలు లెక్కిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. బిల్లు చెల్లింపులు కోసం భారీ మొత్తంలో ఆశించి.. ఫైల్‌ను నెలలు తరబడి తొక్కి పెట్టడంతో బాధితులు రోడ్డెక్కే పరిస్థితి దాపురించింది.

విద్యాజ్యోతి సంగతి ఇదీ

జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఏటా జడ్పీ నుంచి స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఈ పథకానికి విద్యా జ్యోతి అని నామకరణం చేశారు. నిపుణులైన ఉపాధ్యాయులు ఈ స్టడీ మెటీరియల్ తయారు చేయడంతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతుంది. ఈ మెటీరియల్ చదవడం వల్లే 10 తరగతి పరీక్ష ఫలితాల్లో తనకు 596 మార్కులు వచ్చాయని కారంపూడి మండలానికి చెందిన విద్యార్థిని (మిగతా 7లో)

మూడు జిల్లాలకు..35 వేల పుస్తకాలు

విద్యాజ్యోతి పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు 2024-25 సంవత్సరానికి మొత్తం 35 వేల పుస్తకాలు సరఫరా చేశారు. గుంటూరు జిల్లాకు 11,806, పల్నాడు జిల్లాకు 17,657, బాపట్ల జిల్లాకు 5,284 చొప్పున తెనాలి కి చెందిన సంస్థ సరఫరా చేసింది. సుమారు 550 పేజీలకు పైగా ఉన్న ఒక్కో పుస్తకం ఖరీదు రూ.177గా ఉంది. పేద విద్యార్థులకు అవసరమయ్యే.. మెటీరియల్ కావడంతో అతి తక్కువ ధరకు టెండర్ కోడ్ చేసినట్లు బాధితులు చెబుతున్నారు.



క్వాలిటీ పరీక్షల్లో ఓకే

పుస్తకాల ముద్రణ, పేపర్ నాణ్యతకు సంబంధించి హైదరాబాద్‌లోని ల్యాబ్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా పరిషత్ అధికారులు లేఖ రాశారు. మార్చి 19న సదరు ఫైల్‌ను హైదరా బాద్‌కు పంపారు. అదే నెల 25న హైదరా బాద్ ప్రభుత్వ రంగ సంస్థ విద్యాజ్యోతి పుస్తకాల నాణ్యతను నిర్ధారిస్తూ సర్టిఫికెట్ మంజూరు చేసింది. అది వచ్చిన తర్వాత కూడా జడ్పీ అధికారులు బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ఫైల్ ను పెండింగ్ పెట్టడం వెనుక మర్మం ఏంటన్న ప్రశ్నలు వస్తున్నాయి.

SCHOLARSHIP ALERT

Unnati 2-Towards a Better Future Scholarship

Description: CNH Industrial (India) Private Limited invites applications from students who are currently studying in Class 8 to 10 or in first-year ITI/Diploma courses in Gurgaon, Delhi, and Noida.

Eligibility: The school-level scholarship is for applicants studying in Classes 8 to 10, who have scored at least 60% in the previous academic year.

- For the ITI/Diploma level scholarship, the student must be studying in the first year of the course.
- Students from Gurgaon, Delhi, or Noida whose total family income does not exceed 5 lakh are eligible to apply.
- Children of Buddy4Study and CNH Industrial (India) Private Limited employees are not eligible to participate.

Prizes & Rewards: Scholarships up to 12,000 per year for up to three years for school students.

- Scholarship up to 18,000 per year for two years for Diploma/ITI students.

Last Date to Apply: 17-08-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/UTBF3

HOPE Engineering Scholarship by Schaeffler India 2025



Description: Schaeffler India invites applications from first-year engineering female students (preference will be given to students with physical disabilities) to provide them with financial support for their engineering studies.

Eligibility: The scholarship is open to female students across India enrolled in the first year of an engineering program at any UGC or state-recognised college. Preference will be given to students with disabilities and those pursuing core engineering branches such as Automobile, Mechanical, Mechatronics, Electrical and Electronics, Electronics and Communication, Production, Instrumentation, Computer Science Engineering, and Information Technology. Applicants must have scored over 60% in Class 12 (Science) (40% marks for PwD) in the academic year 2024–25, with an annual family income of less than INR 5 lakh.

Prizes & Rewards: Scholarship of INR 50,000 per year for four years
Last Date: 30-07-2025 ***Application:*** Online only
Short Url: www.b4s.in/aj/SIHE16

ఐఐటీలు అందించే ఉచిత ఏరో ఇంజనీరింగ్ కోర్సులు

ఏరో స్పేస్ ఇంజనీరింగ్‌కు సంబంధించి దేశంలోని కొన్ని ఐఐటీలు ఉచిత ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు తమ రెగ్యులర్ కోర్సులతోపాటు వీటిని కూడా చేయవచ్చు.



దేశంలో ఏరో స్పేస్ ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వీటిని దృష్టిలో పెట్టుకుని ఐఐటీలు ఈ ఉచిత ఆన్‌లైన్ కోర్సులను డెవలప్‌చేశాయి.

ఇంట్రడక్షన్ టు ఏరోస్పేస్ ఇంజనీరింగ్: ఈ కోర్సును బొంబాయి ఐఐటీ అందిస్తోంది. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ రంగం పట్ల బేసిక్ అవగాహన కల్పించడానికి ఈ కోర్సును ప్రారంభించారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఇంట్రడక్షన్ టు ఎయిర్ క్రాఫ్ట్ డిజైన్: ఈ కోర్సును బొంబాయి ఐఐటీ అందిస్తోంది. ఎయిర్‌క్రాఫ్ట్, వాటి ఫీచర్స్, కాన్ఫిగరేషన్ సెలెక్షన్, టైప్స్ ఆఫ్ లోడ్స్, ఆపరేషనల్ ఇష్యూస్ తదితరాలన్నింటినీ బోధిస్తారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

ఎలిమెంట్స్ ఆఫ్ మెకానికల్ వైబ్రేషన్: ఢిల్లీ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. వైబ్రేషన్ థియరీ ఫండమెంటల్స్, ప్రాక్టికల్ ఎగ్జామ్‌పుల్స్ తదిరాలు ఇందులో ఉంటాయి. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఇంట్రడక్షన్ టు ఎయిర్‌ప్లేన్ పర్ఫార్మెన్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ఎయిర్ క్రాఫ్ట్ డిజైన్, ఫ్లైట్ టెస్టింగ్, ఎయిర్‌ప్లేన్ పర్ఫార్మెన్స్ తదితరాలను వివరిస్తారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహిస్తారు.

ఎయిర్ క్రాఫ్ట్ స్టెబిలిటీ అండ్ కంట్రోల్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ఎయిర్‌ప్లేన్ స్టెబిలిటీ, కంట్రోల్ విషయాలను బోధిస్తారు. 2025 ఆగస్టు 15 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి.

డిజైన్ టు ఫిక్స్‌డ్ వింగ్ అన్‌మాన్డ్ ఏరియల్ వెహికిల్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 జూలై చివరి వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

యూఏవీ డిజైన్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 ఆగస్టు 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంట్రడక్షన్ టు ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. ప్రొపల్షన్ థియరీ, ప్రాక్టికల్స్‌పై క్లాసులు ఉంటాయి. ఎయిర్ క్రాఫ్ట్, రాకెట్ ఇంజన్ల డిజైన్, ఆపరేషన్, ఇన్‌స్టాలేషన్, రిపెయిర్, మెయింటెనెన్స్‌పై అవగాహన పెంచుతారు.

అప్లయిడ్ కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్: కాన్పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది. 2025 ఆగస్టు 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పేస్ ఫ్లయిట్ మెకానిక్స్: ఖరగ్‌పూర్ ఐఐటీ ఈ కోర్సును అందిస్తోంది.

దిక్సూచి

గేట్ స్కోరు లేకుండా గౌహతి ఐఐటీలో ఎంటెక్

ఫ్లడ్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై గౌహతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) కొత్త ఎంటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఫ్లడ్ అండ్ వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్‌పై పనిచేసే వారిని ఉద్దేశించి ఈ కోర్సును ప్రారంభించినట్లు ఐఐటీజీ తెలిపింది. ఈ కోర్సులో చేరడానిని గేట్ స్కోరు అవసరం లేదు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్ ఇస్తారు. సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నిర్వహించే ఈ కోర్సు చేరాలనుకునేవారికి కనీసం ఒక సంవత్సరం వాటర్ రిసోర్స్ సెక్టార్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి. అలాగే కనీసం 6 జీపీఏతో నాలుగు సంవత్సరాల గ్రాడ్యుయేషన్ కోర్సు(సివిల్/ అగ్రికల్చర్ అనుబంధ ఇంజనీరింగ్ కోర్సులు చేసి ఉండాలి. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా హైబ్రీడ్ మోడల్‌లో జరుగుతుంది. ఆన్‌లైన్‌లో క్లాసులు ఉంటాయి. ల్యాబ్‌లు, ఫైనల్ పరీక్షలు క్యాంపస్‌లో నిర్వహిస్తారు.



దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 31
వెబ్‌సైట్: www.iitg.ac.in/oes/odp/mtech/fwrm

జాబ్ కార్నర్

ఏపీపీఎస్సీలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

ఖాళీలు 691

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 691 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ 256, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ 435 పోస్టులు ఉన్నాయి.

అర్హత: ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. నిర్దేశించిన శారీరక ప్రమాణాలు తప్పనిసరి. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్న అభ్యర్థులకు బోనస్ మార్కులు ఇస్తారు.

వయస్సు: 2025 జూలై 1వ తేదీ నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. నిబంధనల మేరకు వయస్సు సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్స్, మెడికల్ టెస్ట్, కంప్యూటర్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఆగస్టు 5
వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

ఎయిమ్స్‌లో

ఖాళీలు 3,501

దేశ వ్యాప్తంగా ఉన్న ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో 3,501 పోస్టుల భర్తీకి న్యూఢిల్లీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవన్నీ కూడా గ్రూప్-బీ, గ్రూప్-సీ కేడర్ నాన్ ఫ్యాకల్టీ పోస్టులు.

పోస్టులు: డైటీషియన్, అసిస్టెంట్ డైటీషియన్, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, టెక్నీషియన్, స్టాఫ్ నర్స్, లాబ్ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్, మెకానిక్, సీఎస్ఎస్‌డీ టెక్నీషియన్, అటెండెంట్, రేడియోగ్రాఫర్, ఈసీజీ టెక్నీషియన్, మెకానిక్, సీఎస్ఎస్ టెక్నీషియన్, అటెండెంట్ తదితరాలు ఇందులో ఉన్నాయి.

అర్హత: పోస్టును బట్టి టెన్త్, ఇంటర్, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, బీఈ, డీఎంఎల్‌టీ, బీఎంఎల్‌టీ, బీఫార్మసీ తదితరాలు ఉండాలి. కొన్ని పోస్టులకు సంబంధిత డిపార్ట్‌మెంట్ అనుభవం కూడా ఉండాలి.

వయస్సు: పోస్టును బట్టి 18 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయస్సు సడలింపు ఉంటుంది.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ తదితరాలు ఉంటాయి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 31
సీబీటీ పరీక్ష తేదీలు: 2025 ఆగస్టు 25, 26
వెబ్‌సైట్: https://rrp.aiimsexams.ac.in/

ఇంటెలిజెన్స్ బ్యూరోలో

ఖాళీలు 3,717



కేంద్ర హోంమంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కింద 3,717 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

పోస్టులు: అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-11/ ఎగ్జిక్యూటివ్. మొత్తం 3717 పోస్టులు ఉన్నాయి. అందులో అన్ రిజర్వుడు 1537, ఈడబ్ల్యూఎస్‌లో 442, ఓబీసీ 946, ఎస్సీ 566, ఎస్టీ 226 పోస్టులు ఉన్నాయి. ఇది జనరల్ సెంట్రల్ సర్వీస్, గ్రూప్ సీ పోస్టు(నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్)

విద్యార్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 2025 ఆగస్టు 10 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. నిబంధనలు అనుసరించి వయస్సులో సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక: రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ఉంటుంది. టైర్-1 వంద మార్కులకు ఉంటుంది. ఇందులో కరెంట్ అఫైర్స్, జనరల్ స్టడీస్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, ఇంగ్లిష్ ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానానికి 0.25 మార్కులు కట్ చేస్తారు.

- టైర్-1 డిస్క్రిప్టివ్‌గా ఉంటుంది. దీనికి 50 మార్కులు. ఎస్సే ఇంగ్లిష్ కాంప్రిహెన్షన్, లాంగ్ ఆన్సర్ తరహా ప్రశ్నలు ఉంటాయి. టైర్-3 వంద మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుంది

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 ఆగస్టు 10 **వెబ్‌సైట్:** https://www.mha.gov.in/en

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మన చరిత్ర చెప్పాలనే ప్రయత్నం

– అశ్విన్ కుమార్



పురాణాల్లోని దశావతారాల ఆధారంగా తెరకెక్కుతోన్న 'మహావతార్ సినిమాటిక్ యూనివర్స్‌లో వస్తున్న తొలి యానిమేషన్ త్రీడీ చిత్రం 'మహావతార్ నరసింహ'. హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో శిల్పా ధావన్, కుశాల్ దేశాయ్ నిర్మించారు. అశ్విన్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు.

- నరసింహ స్వామి అవతారం కేవలం ఒకపురాణ గాథ కాదు. మన చరిత్ర. దాని గురించి ప్రతి తరానికీ చెప్పాల్సిన అవసరం ఉంది. నేటి బాలలకు మన సంస్కృతి గురించి అవగాహన కలిగించేలా ఈ సినిమా ఉంటుంది. ఇప్పటివరకూ చూడని విజువల్స్‌ను బిగ్‌స్క్రీన్ మీద చూడబోతున్నారు. వార్ సీక్వెన్స్‌లు చాలా అద్భుతంగా ఉంటాయి. సరికొత్త అనుభూతిని పంచుతాయి.
- భారీ బడ్జెట్‌తో మంచి నిర్మాణ విలువలతో తీసిన సినిమా ఇది. చరిత్ర, సంస్కృతి, ధార్మిక అంశాల మేళవింపుగా తెరకెక్కించాం. గీతా ఆర్ట్స్ తెలుగులో విడుదల చేయడం ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు మరింత చేరువ చేస్తుంది.
- శ్రీ మహావిష్ణువు దశావతారాలను బిగ్ కాన్వాస్‌లో చూపించాలనే ఆలోచనతో మహావతార్ యూనివర్స్ మొదలైంది. ఈ సినిమాటిక్ యూనివర్స్‌లో వస్తున్న తొలి చిత్రం 'మహావతార్ నరసింహ'. నటీనటుల ఇమేజ్ దేవుడి పాత్రలను డామినేట్ చేసే అవకాశం ఉంటుంది కాబట్టే యానిమేషన్‌లో అయితేనే ఇలాంటి కథకు న్యాయం చేయగలం అని భావించాం.

ప్రేక్షకాదరణ ఆనందాన్నిస్తోంది

– ప్రవీణ పరుచూరి



'ఒక మంచి సినిమాను తీయడం దాన్ని ప్రేక్షకుల చెంతకు చేర్చడం చాలా కష్టం. ఎన్నో అడ్డంకులను అధిగమించి 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చాం. మా కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది. ప్రేక్షకాదరణ ఆనందాన్నిస్తోంది. మానవ సంబంధాల్ని చక్కగా చూపించారు అని అందరూ ప్రశంసిస్తున్నారు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. మనోజ్ చంద్ర, మోనిక హీరో హీరోయిన్లుగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'పాత్రల తాలూకు భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందుతున్నారు. రామకృష్ణ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అయిన విధానం, సినిమాను ఆస్వాదిస్తున్న తీరు ఆనందాన్నిస్తోంది. నా సినీ గమనాన్నే మార్చిన పాత్ర చేశాను. మంచి సినిమాతో ప్రేక్షకులను అలరించాలనే కోరిక నెరవేరింది' అని అన్నారు. మనుషుల విలువల్ని, వారి మధ్య ఉండే భావోద్వేగాల్ని దర్శకురాలు తెరపై ఎంతో సహజంగా చూపించారు కాబట్టే సినిమా విజయవంతమైంది అని నిర్మాతలు పేర్కొన్నారు.

సీఎం రేవంత్‌ను కలసిన దుల్కర్ సల్మాన్



మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల జరిగిన గద్దర్ అవార్డుల వేడుకల్లో 'లక్కీ భాస్కర్' చిత్రానికి గాను దుల్కర్‌ను ఉత్తమ నటుడి పురస్కారం వరించిన విషయం తెలిసిందే. అయితే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి దుల్కర్ హాజరు కాలేకపోయారు. ఆదివారం దుల్కర్ సల్మాన్ తన టీమ్‌తో కలసి సీఎం చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఆయనతో పాటు నిర్మాతలు స్వప్న దత్, సుధాకర్ చెరుకూరి తదితరులు ఉన్నారు.

పవన్‌కు జోడీగా



హీరోయిన్ రాశీ ఖన్నా ఓ క్రేజీ ఆఫర్ దక్కించుకున్నారు. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా దర్శకుడు హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. ఇందులో ఇద్దరు కథానాయికలకు అవకాశం ఉండడంతో శ్రీలీలను ఇప్పటికే ఓ కథానాయికగా ఖరారు చేశారు. మరో కథానాయికగా రాశీని ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్‌లో జరుగుతున్న చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్‌లో పవన్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటోంది. సినిమాలో శక్తిమంతమైన పోలీస్ పాత్రలో ఆయన కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్, హరీశ్ కాంబోలో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి.



బాలీవుడ్ నటుడు సోనూసూద్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియో ఒకటి ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ముంబైలోని తన నివాసం దగ్గర్లో విషపూరితం కాని ఒక పామును ఆయన ఎంతో చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ వీడియోను తన ఇన్‌స్టా ఖాతాలో పోస్ట్ చేశారు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది మీరు ప్రయత్నించొద్దు. ఇటువంటి పరిస్థితి ఎదురైతే నిపుణులను సంప్రదించండి. జాగ్రత్తగా ఉండండి' అని పేర్కొన్నారు.

డాన్ దర్శకుడు చంద్ర బారోట్ కన్నుమూత




అమితాబ్ బచ్చన్ కథానాయకుడిగా నటించిన బాలీవుడ్ క్లాసిక్ హిట్ 'డాన్' దర్శకుడు చంద్ర బారోట్ (86) కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మనోజ్ కుమార్ నటించి, నిర్మించిన పలు చిత్రాలకు చంద్ర సహాయ దర్శకుడిగా పనిచేశారు. 'డాన్' సినిమాను అద్భుతంగా తెరకెక్కించి, తొలి చిత్రంతోనే ఇండస్ట్రీ హిట్‌ను అందుకున్నారు. 1990లో ఆయన తెరకెక్కించిన బెంగాలీ చిత్రం 'ఆశ్రిత' ప్రేక్షకాదరణ పొందింది. తన సినిమా కెరీర్ సజావుగా సాగకపోవడంతో చంద్ర బారోట్ సినిమాల నుంచి వైదొలగి అడ్వర్టైజ్‌మెంట్ రంగంలో కొనసాగారు. 'డాన్' చిత్రం పలు భాషల్లో రీమేక్ అయింది. తెలుగులో ఎన్టీఆర్ హీరోగా 'యుగంధర్' పేరుతో తెరకెక్కి మంచి విజయాన్ని అందుకుంది. అమితాబ్ సహా పలువురు బాలీవుడ్ తారలు ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు.



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఇండస్ట్రీకి చెందిన మహిళా స్టంట్‌మాస్టర్స్‌ను సత్కరించింది. ఈ కార్యక్రమంలో టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణగౌడ్, సీనియర్ నటుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టులో ఆరంభం



సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా అపూర్వ లాఖియా 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' అనే చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. తెలంగాణ వాసి కల్నల్ బికుమళ్ల సంతోష్‌బాబు జీవితం ఆధారంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ చిత్రం రెగ్యులర్ షూట్‌ను ఆగస్టు నుంచి ప్రారంభించనున్నారు. ముంబైలో జరిగే ఈ షెడ్యూల్‌తో సల్మాన్ ఖాన్ సెట్స్‌లో అడుగుపెట్టనున్నారు. ఇందులో కథానాయకుడి గతానికి సంబంధించిన ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఆ తర్వాత లద్దాఖ్‌లో ఓ కీలక షెడ్యూల్‌ను మొదలుపెట్టనున్నారు మేకర్స్. వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ఈ సినిమాలో శక్తిమంతమైన యుద్ధవీరుడిగా కనిపించేందుకు సల్మాన్ పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఇందుకోసం శిక్షణ కూడా తీసుకున్నారు.

అజిత్‌కు తప్పిన ప్రాణాపాయం



కారు రేసింగ్ పోటీల్లో పాల్గొన్న హీరో అజిత్ కుమార్ కారు మరోమారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయన అదృష్టవశాత్తు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇటలీలో జీటీ4 కార్ రేసింగ్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో అజిత్ కుమార్ రేసింగ్ జట్టు కూడా పాల్గొంటోంది. ఆ సందర్భంగా అజిత్ కుమార్ నడుపుతున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ పోటీల్లో ముందుభాగంలో దూసుకెళుతున్న కారు ఒకటి ఉన్నట్టుండి అడ్డుగా రావడంతో ఆ కారును అజిత్ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. అయితే, అజిత్ మాత్రం అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడ్డారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఆడిషన్ల పేరిట మోసాలను అడ్డుకోవాలి

రకరకాల పేర్లతో ఏర్పాటవుతున్న నకిలీ సినీ అసోషియేషన్లు ఆడిషన్ల పేరిట మోసాలకు పాల్పడుతున్నాయి, సినీ ఇండస్ట్రీకి చెందిన యూనియన్‌లు అన్నీ ఏకతాటిపైకి వచ్చి, ఇలాంటి మోసాలను అడ్డుకోవాలని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'సినీరంగం పట్ల ఆసక్తి ఉన్నవారు నిజమైన సినీ సంఘాలను సంప్రదించి, వారి ద్వారా ఇండస్ట్రీలో అడుగుపెట్టాల'ని సూచించారు. ఏపీలో కొన్ని చోట్ల ఆడిషన్ల పేరుతో ప్రజలను మోసం చేయాలని చూసేవాళ్లను అడ్డుకున్నామని తెలిపారు. ఎటువంటి అవగాహన లేకుండా కొందరు యూనియన్లు ఏర్పాటు చేసి చిన్న కళాకారులు, టెక్నీషియన్ల నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారనీ దీనిపై చిత్ర పరిశ్రమ పెద్దలు స్పందించాలని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ వ్యవస్థాపకులు అంబటి మధుమోహన్ కృష్ణ కోరారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

● రాష్ట్ర శ్రేయస్సు కోసమే కూటమికి మద్దతు
● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన


సంఘీబావం తెలియజేస్తున్న సంఘం నేతలు కేసన, క్రాంతికుమార్, శేషయ్య తదితరులు

గుంటూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులగణన చేసిన తర్వాతే.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు స్పష్టం చేశారు. నల్లపాడు రోడ్డులోని సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల జనగణన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీల రిజర్వేషన్ శాతాన్ని తేల్చాలని కోరారు. రాష్ట్రంలో ఓబీసీలకు వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ఏ రాజకీయ పార్టీకైనా గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కాపులను బీసీల్లో చేరుస్తామనే అంశంపై నిరసన తెలియజేశామన్నారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ఓబీసీ రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రకటించారని, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓబీసీల రిజర్వేషన్ ఎంతో శాతమో తేల్చాలన్నారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో మూడు అసెంబ్లీ స్థానాలను బీసీలకే కటాయించాలని కోరారు. హక్కుల సాధనకు త్వరలోనే కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా క్రాంతికుమార్

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుమ్మర క్రాంతికుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు నియామకపు ఉత్తర్వులు అందజేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ నిమ్మల శేషయ్య, సంఘం నేతలు పాల్గొన్నారు.

పప్పెట్రీతో బోధన సులభతరం

● జాతీయ వర్క్‌షాప్‌లో రావెల ఉపాధ్యాయిని



రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయ బృందం

తాడికొండ(రావెల)జూలై 20(ఆంధ్రజ్యోతి): పప్పెట్రీ ద్వారా బోధన మరింత సులభతరం అవుతుందని, విద్యార్థులు సులభంగా పాఠ్యాం శాలను అర్థం చేసుకోగలరని మండలంలోని రావెల ఏఎం స్కూల్ ఉపాధ్యాయురాలు బండి ఏస్తేరు రాణి పేర్కొన్నారు. కల్చరల్ అండ్ క్రాఫ్ట్ రిసోర్స్ సెంటర్ ఢిల్లీ, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అనుబంధంగా జూలై 3 నుంచి 17 వరకు "పప్పెట్రి ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ ఇన్ లైన్ విత్ ఎన్ఈపీ-2020" వర్క్ షాప్ జరిగింది. ఇందులో దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల నుంచి 68 మంది ఉపాధ్యాయుల ఎంపికయ్యారు. ఏపీ నుంచి ఏడుగురు ఉపాధ్యాయులు ఎంపిక కాగా..అందులో ఎస్తేరు రాణి ఒకరు. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన ఏస్తేరు రాణి మాట్లాడుతూ.. తను నేర్చుకున్న అంశాలను పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలియజేస్తామని చెప్పారు.

శాకంబరిగా భ్రమరాంబకు పూజలు

● అమ్మవారికి సారె సమర్పించిన ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు



పెదకాకాని, జూలై 20(ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం భ్రమరాంబ అమ్మవారికి శాకంబరిగా అలంకరణ చేశారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, డ్రైఫ్రూట్స్‌తో వైభవోపేతంగా అలంకరించారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దంపతులు దేవస్థానానికి మేళతాళాల మధ్య చేరకుని అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించారు. అర్చకులు మల్లేశ్వరస్వామికి, భ్రమరాంబకు నరేంద్రకుమార్ దంపతులతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేయించారు. అనంతరం వేద ఆశీర్వచనం అందించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. శాకంబరీ దేవి అలంకరణలో భ్రమరాంబ అమ్మవారని వేలాది మంది భక్తులు దర్శించు కున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు బోయపాటి రామ్మోహన్‌రావు, మహిళలు పాల్గొన్నారు.


అమ్మవారికి ఆషాఢం సారె తీసుకొస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర దంపతులు

జగన్ ఆలోచనలు సమాజానికి ప్రమాదకరం

● గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

గుంటూరు(తూర్పు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): హింస, అవినీతితో రాజకీయాల్లో రాణించాలనే జగన్ ఆలోచనలు రాష్ట్రానికి ప్రమాదకరంగా మారుతు న్నాయని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుంటూరు విద్యానగర్‌లో ఆదివారం జరిగిన విలేకరు ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత విమర్శలు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు వంటి కొత్త సంస్కృతిని జగన్ తీసుకువచ్చాడని మండిపడ్డారు. పేర్ని నాని లాంటి నాయకులు హింసను ప్రోత్సహిస్తే ఊరుకోబోమని స్పష్టం చేశారు. మహా భారతంలో ధర్మరాజుకు కోపం వస్తే ఏమి జరిగిందో గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌తో పాటు కూటమి నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను గమనించి ఆ పార్టీకి, జగన్‌కు దూరంగా ఉండాలని హితవు పలికారు. పరామర్శ పేరుతో జగన్ బల ప్రదర్శన చేస్తున్నాడని.. ఏ సీజన్‌లో ఏ పంటలు పండిస్తారో తెలియని అతను న్యాయం చేస్తాడని రైతులు అనుకోవడం లేదన్నారు. గంజాయి తప్ప ఇతర పంటలపై జగన్‌కు అవగాహన లేదని యరపతినేని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం, ఇతర కుంభకోణాలపై విచారించి నిందితుల్ని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. విషపు రంగు నీళ్ల అమ్మి పేదల రక్తాన్ని జలగల మాదిరి పీల్చిన వారిని ఎందుకు వదిలి పెట్టాలని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో గురజాల నియోజకవర్గంలో 11 మంది టీడీపీ కార్యకర్తలను చంపారని, మైనింగ్ గుంతల్లో ఆరుగురు చిన్న పిల్లలు చనిపోయారని.. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపిస్తామని చెప్పారు. నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విడుదల చేసిన రూ.1,200 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులను చేపట్టామని పేర్కొన్నారు. పల్నాడు ప్రాంతంలో మరో రెండు సిమెంట్ పరిశ్రమలు వస్తున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు. గురజాల, ఇతర ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆయన కోరారు.

పోరాట యోధుడు శేషగిరిరావు : ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల సమయంలో పాలువాయిగేటులో పోలింగ్ రోజున వైసీపీ అల్లరి మూకలు దాడి చేస్తున్నా అదరకుండా బెదరకుండా వారి అరాచకాలు, దౌర్జన్యకాండకు ఎదురొడ్డి నిలబడిన పోరాట యోధుడు నంబూరి శేషగిరిరావని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యువనేత యరపతినేని నిఖిల్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం శేషగిరిరావు మృతదేహాన్ని సందర్శించి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పార్టీ కోసం పని చేసిన శేషగిరిరావు గురించి చెప్పాలంటే మాటలు రావడం లేదని చెమర్చిన కళ్లతో పేర్కొన్నారు. మే 13, 2024న శేషగిరిరావుపై దాడి జరిగిన తీరును తెలుసుకున్న తాను పాలువాయిగేట్‌కు వచ్చానని, దెబ్బలంటే లెక్క లేదు కానీ, సీఎంగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా తాను గెలవాలని శేషగిరిరావు కోరినట్లు బ్రహ్మారెడ్డి గుర్తు చేశారు. ఓ వైపు రక్తం కారుతున్నా బాధను పంటిబిగువున పెట్టుకుని పార్టీ కోసం పరితపించిన వ్యక్తి శేషగిరిరావన్నారు. వారి కుటుంబ సంక్షేమానికి పార్టీ ఇతోదికంగా సాయం అందిస్తుందన్నారు.


సమావేశంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి,యరపతినేని నిఖిల్

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి.. సెల్‌ఫోన్‌తో పరార్

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూలై20(ఆంధ్రజ్యోతి): వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి.. వాహనదారుల సెల్‌ఫోన్, బైక్ కీ లాక్కొని పారిపోయిన ఘటన చేబ్రోలు - నారాకోడూరు ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. బాధితులు వివరాల మేరకు.. తెనాలి మండలం పెదరావూరుకు చెందిన పుట్టపు పిచ్చియ్య, గాజులవర్తి కిషోర్ చేబ్రోలులోని బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమానికి ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తున్నారు. చేబ్రోలు- నారాకోడూరు మధ్య ఓ పెట్రోల్ వద్ద వీరిని వెనుక నుంచి ఓ కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారులు కింద పడడంతో వారికి గాయాలయ్యాయి. అంతలోనే కారు నుంచి దిగిన యువకులు వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్, ద్విచక్ర వాహనం తాళం లాక్కుని అక్కడి నుంచి పారిపోయారు. స్థానికులు క్షతగాత్రుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పిచ్చియ్య, కిషోర్‌ను తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

జడ్పీ 'ఫైల్స్'!

(5వ పేజీ తరువాయి)

వెల్లడించింది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ మెటీరియల్‌ను తెనాలికి చెందిన ప్రముఖ ప్రింటర్స్ కారు చౌక ధరకు ముద్రించి.. పేద పిల్లలకు అందజేస్తున్నారు.

9 నెలలు దాటినా

విద్యాజ్యోతి మెటీరియల్ టెండర్లు ముగిసి తొమ్మిది నెలలు దాటింది. 35 వేల పుస్తకాలు పంపిణీ చేసినందుకు రూ.80 లక్షలు వరకు బిల్లులు చెల్లించాలి. జడ్పీ అధికారులు మాత్రం ఏదో ఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తున్నారు.

పర్సంటేజీ కోసం పట్టు?

కొన్ని కీలకమైన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్ ఉండటం వెనుక అసలు సంగతి వేరే ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులు తమకు రావాల్సిన పర్సంటే జ్ ఫైనల్ అయిన తర్వాతే కొన్ని ఫైళ్లు పరుగులు పెడుతున్నట్లు చెబుతున్నారు. విద్యా జ్యోతి ఫైల్ కూడా అందుకే పెండింగ్‌లో ఉందన్న ప్రచారం జరుగుతుంది.

నరెడ్కో క్యాపిటల్ జోన్

గుంటూరు అధ్యక్షుడిగా అంకారావు

● ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

గుంటూరు కార్పొరేషన్, జూలై20 (ఆంధ్రజ్యోతి): నరెడ్కో క్యాపిటల్ జోన్ గుంటూరు అధ్యక్షుడిగా సీహెచ్ అంకారావును ఎన్నుకున్నారు. సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరు క్లబ్‌లో నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా పెరవలి నాగవంశీ, అధ్యక్షుడిగా కె.సి.అంకారావు, కార్యదర్శిగా మాదాల శ్రీనివాసరావు, కోశాధికారిగా చిన్న తిరుపతయ్య, వైస్ ప్రెసిడెంటుగా శ్రీనాథ్, యోగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన అన్ని పదవులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముఖ్య అతిథి, ప్రధాన సలహాదారు చుక్కపల్లి రమేష్ నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.


నూతనంగా ఎన్నికైన కమిటీ

రచయితలు బైరాగి, శారద శత జయంతి


శత జయంతి సభలో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్

రచయితలు బైరాగి, శారద శత జయంతి

తెనాలి అర్బన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ప్రముఖ రచయితలు ఆలూరి బైరాగి, శారద శత జయంతి కార్యక్రమం ఆదివారం పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. సాహిత్య అకాడమీ, వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వెంకటలక్ష్మమ్మ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన సభకు ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి అధ్యక్షత వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ.. సమాజాన్ని దిశా నిర్దేశం చేసే రచనలు రచయితలు అందించారన్నారు. ఐతానగర్‌లో బైరాగి విగ్రహం ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, శివప్రసాద్, రవిబాబు, శ్రీనివాసరావు, ఆదిత్య, గుజ్జర్లమూడి కృపాచారి, శారద కుమార్తె శారద ప్రసంగించారు.

వెబ్ ఆప్షన్స్ గడువు పొడిగింపు

లాంఫాం(తాడికొండ)జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డిప్లమా కోర్సుల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు.. వెబ్ ఆప్షన్స్ గడువును ఈ నెల 25 వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం తిరుపతి కళాశాలలో అగ్రికల్చర్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి అనుమతించటం జరిగిందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

పరవళ్లు.. నారుమళ్లు !

(5వ పేజీ తరువాయి)

శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 247 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్‌లో నీటి నిల్వలు పెరుగుతుండటంతో కుడి కాలువ ఆయకట్టులో సాగుకు భరోసా వచ్చింది.

రాయితీ విత్తనం మాటేంటి?

సాగర్ కుడి కాల్వకు సాగు నీటిని విడుదల చేసేందుకు ఒకవైపు జలవనరుల శాఖ సమాయత్తమవుతుండగా.. వ్యవసాయ శాఖ మాత్రం సాగుపై ఇంకా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికే వరి విత్తనాల నిల్వలు సిద్ధం చేసి.. రైతులకు రాయితీపై సరఫరా చేయాల్సి ఉంది. కానీ, వ్యవసాయశాఖ విత్తన పంపిణీ ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారుల నుంచి రైతులు విత్తనం కొనుగోలు చేస్తున్నారు. దీంతో విత్తన రాయితీని వారు కోల్పోతున్నారు. జిల్లాలో 1,33,400 ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు వరి విత్తనం సిద్ధం చేయలేదు. జిల్లాలో 26,825 క్వింటాళ్ల వరి విత్తనం అవసరమవు తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. బీపీటీ-5204, జేజీఎల్ -354, కేఎన్ఎం- 1638, ఎన్ఎల్ఆర్-34449,అంకుర్ సోనా, హెచ్ఎంటీ, బీపీటీ-2782, బీపీటీ-2846 రకాల విత్తనాలు సరపడా నిల్వలు డీలర్ల వద్ద ఉంచాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారే తప్ప.. క్షేత్రస్థాయిలో చర్యలు కానరావడం లేదు.

మద్యం కేసులో తిమింగలానికి త్వరలో శిక్ష

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు


కరపత్రం అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ జూలై 20, (ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో అసలు తిమింగలానికి త్వరలోనే శిక్ష తప్పదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రస్తుతం సిట్ అరెస్టులన్నీ చిన్న చేపలవేనన్నారు. పట్టణంలోని కల్యాణ్‌పురి కాలనీలో ఆదివారం రాత్రి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం విలేకరులతో జీవీ మాట్లాడారు. సాగర్ ఆయకట్టు రైతులకు ఆగస్టు మొదటి వారంలో సాగు నీరు విడుదల చేస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధం

ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 20 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో 16,500 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం భట్టిప్రోలులోని పద్మశాలీయ బహోత్తమ సంఘం కార్యాలయంలో మార్కండేయ పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అనంతరం సభలో ఆయన మాట్లాడుతూ, కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర విద్యా శాఖమంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వాతావరణం కల్పించడంతో పాటు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి.. నాణ్యమైన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం పాటుపడుతోందన్నారు. పద్మశాలీయ సేవా సంఘం సేవలను కొనియాడారు. సంఘం సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, బట్టు మల్లికార్జునరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

చెట్టును ఢీకొన్న ట్రాలీ ఆటో - ఇద్దరికి గాయాలు

శావల్యాపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ట్రాలీ ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గుంటూరు - కర్నూలు జాతీయ రహదారిపై మండలంలోని కృష్ణాపురం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గిద్దలూరు నుంచి వంకాయల లోడుతో బయలుదేరిన ట్రాలీ ఆటో తెల్లవారుజామున రెండు గంటల సమయంలో కృష్ణాపురం సమీపానికి రాగానే అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఆటోలో ఉన్న దమ్మవరపు బన్నీకి స్వల్పంగా గాయపడగా.. అతని తమ్ముడు శేఖర్ ఆటో క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో రెండు కాళ్లకూ తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు తెలిపారు.


ఆటో క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన శేఖర్

ఖాకీల తక్షణ స్పందన తల్లికూతుళ్లను కాపాడింది


తల్లీ కూతుళ్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న వెదుళ్ళపల్లి పోలీసులు

బాపట్లరూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కుమార్తెలతో రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించిన మహిళను పోలీసులు తక్షణం స్పందించి రక్షించారు. ఖాకీల సమయస్ఫూర్తితో ముగ్గురి నిండు ప్రాణాలను రక్షించగలిగారు. ఈ ఘటన స్టూవర్టుపురం రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నిస్తోందని వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్‌కు ఆదివారం ఉదయం ఫోన్ వచ్చింది. దీంతో వెంటనే స్పందించిన ఎస్సై భాగ్యరాజు తన సిబ్బందితో కలిసి రైల్వేట్రాక్‌పై ఉన్న మహిళ, ఇద్దరు కుమార్తెలను చాకచాక్యంగా కాపాడారు. ఆత్మహత్యాయత్నానికి కుటుంబ వివాదాలే కారణమని తెలుసుకొని.. కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు స్పందించిన తీరుపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీ తుషార్ డూడి ఈ ఘటనపై స్పందించారు. కుటుంబ వివాదాలను కూర్చుని పరిష్కరించుకోవాలన్నారు. అప్పటికీ సమస్య తీరకపోతే.. పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడిలోనైనా ఆత్మహత్య నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. కుటుంబ వివాదాల పరిష్కారానికి మహిళా పోలీసులతో కూడిన ప్రత్యేక బృందం అందుబాటులో ఉందని.. జిల్లా ప్రజలు వీరి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వేగంగా స్పందించి ముగ్గురుని కాపాడిన వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

మహిళకు వేధింపులు..వీఆర్వోపై కేసు

బెల్లంకొండ, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన వీఆర్వో వెంకయ్యపై బెల్లంకొండ పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళ - తల్లికి వందనం పథకం కోసం సంతకం చేయాలని వీఆర్వో వద్దకు వెళ్లింది. అయితే వీఆర్వో వెంకయ్య కోరిక తీరిస్తేనే సంతకం పెడతానని వేధించడంతో.. బాధిత మహిళ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	119, 127, 137
చికెన్ విత్ స్కిన్(కిలో)	226.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	236.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె


శ్రీలలిత త్రిపుర సుందరిదేవి అమ్మవారికి ఆషాడమాస సారె తీసుకెళుతున్న ఉమామహేశ్వర భక్తబృందం

శ్రీలలిత త్రిపురసుందరిదేవికి ఆషాఢ మాస సారె

బాపట్ల,జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చీలురోడ్డు సెంటర్‌లో ఉన్న శ్రీ రుక్మిణి సమేత పాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువుతీరిన శ్రీలలిత త్రిపురసుందరిదేవి అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉమామహేశ్వర భక్తబృందం సారె సమర్పించారు. దేవాలయ ప్రాంగణం నుంచి మేళతాళాలతో బయలుదేరి చీలురోడ్డు రామాలయంలో సీతమ్మవారికి సమర్పించి మరలా ఊరేగింపుగా దేవాలయానికి వచ్చి లలిత త్రిపురసుందరిదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి విశేష అలంకరణ లలితసహ్రసనామ సహిత విశేష కుంకుమర్చాన కార్యక్రమం, నీరాజన మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమం నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. అదేవిధంగా ఆడికృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష స్నపన, విశేష అలంకరణ, స్వామివారికి పూజా కార్యక్రమం, నీరాజనం మంత్రపుష్పాలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి నవగ్రహ మండపం దగ్గర తమిళనాడుకు చెందిన రవికుమార్, సరస్వతి దంపతులు రూ.60 వేలతో షెడ్ నిర్మించారు. నూతనంగా నిర్మించిన షెడ్‌లో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మార్టూరి బదిరినారాయణ, మురళి వెంకటరమణ దంపతులు, ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు, నెమలికంటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపోలేరమ్మతల్లికి...

ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో కంకటపాలెం ఎస్టీ కాలనీ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి శ్రీపోలేరమ్మతల్లికి ఘనంగా ఆషాఢమాస సారె తీసుకొచ్చారు. కుంకుమ, గాజులు, చీర, పొంగళ్ళు, నైవేద్యాలు మంగళవాయిద్యాలతో అమ్మవారి నామం పలుకుతూ గ్రామోత్సవం నిర్వహించి సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ రాయపూడి అంకమ్మచౌదరి, ధర్మప్రచారక్ మోదడుగు సూరిబాబు, బండ్రెడ్డి రజనీ, ఓంటినేని అనూష, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీప్రసన్న దుర్గాభవానీ మాతకు...


శ్రీప్రసన్న దుర్గాభవానీ మాతకు సారె సమర్పిస్తున్న భక్తులు

బాపట్ల పట్టణంలోని ఎస్ఎస్‌పీ అగ్రహారంలో ఉన్న శ్రీ ప్రసన్నదుర్గాభవానీ మాతకు ఆషాఢ మాస సారె సమర్పించారు. భావపురికాలనీ నుంచి భక్తులు ఎస్.సుబ్బారావు, వెంకటరమణమ్మ దంపతులు భక్తులతో కలిసి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించి సారె సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పేరలమ్మతల్లికి..


పేరలమ్మతల్లి

కర్లపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పేరలి గ్రామంలోని గ్రామదేవత పేరలమ్మ తల్లికి ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం గౌడపాలెం మహిళలు సారె, పసుపుకుంకుమలు సమర్పించారు. ఆలయం వద్ద మహిళలు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాటూరి బైరాగి, కర్రి శివయ్య, బొలగాని వెంకటేశ్వర్లు, కర్రి ఉమామహేశ్వరరావు, లుక్కా శివయ్య, కాటూరి ప్రసాద్, ఏమినేని శ్రీనివాసరావు, కాటూరి శ్రీదేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లికి...


అరవపల్లి అంకమ్మతల్లి

రేపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్నఅరవపల్లిలో ఆషాఢ మాసం చివరి ఆదివారం కావటంతో గ్రామంలోని మహిళలంతా గ్రామదేవత అయిన అంకమ్మ దేవతకు పసుపు, కుంకుమ, చీర,సారెతో ఊరేగింపుగా మహిళలు డప్పువాయిద్యాలతో వెళ్ళి అంకమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి సారె సమర్పించారు. అమ్మవారికి సద్దినైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చెరుకుపల్లిలో....

చెరుకుపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లిలోని పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చెరుకుపల్లి పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్ళి చీర, సారె సమర్పించి పూజాదికాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దివిరాంబాబు, దివిశ్రీనివాసరావు, కందుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు


అల్లూరమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటున్న భక్తులు

పిట్టలవానిపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న శ్రీ అల్లూరమ్మ తల్లికి ఆదివారం భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీ అల్లూరమ్మతల్లి శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. మానవాళికి సకల సౌఖ్యాలు కలగాలని, అల్లూరమ్మతల్లిని ఆషాఢ మాసంలో ఆరాధించుకోవటం ఎంతో శ్రేష్ఠమని ఆలయ ప్రధాన అర్చకులు వల్లూరి శివసుబ్రహ్మణ్యం భక్తులకు తెలిపారు. శాకంబరి అమ్మవారిని పూజించటం వల్ల ఆయురారోగ్యాలతోపాటు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని చెప్పారు. స్థానిక ఆర్యవైశ్యులు అల్లూరమ్మ అమ్మవారికి సారె సమర్పించి పూజలు నిర్వహించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


చంపాడులో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అంటూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చంపాడు గ్రామస్థులను ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం వర్షాన్ని కూడా లెక్క చేయకుండా ఎమ్మెల్యే మండలంలోని చంపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని రెండు దళితవాడల్లో ఇంటింటికి తిరిగి ఏడాది పాలనకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రత్యేకించి వృద్ధులు మహిళలను పలకరిస్తూ వారికి సంబంధించిన పథకాల విషయంపై ప్రశ్నించారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. దళితవాడలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని ప్రధాన రహదారి నుంచి గ్రామంల్లోకి రోడ్డు మార్గాన్ని నిర్మించాలని గ్రామస్థులు కోరారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు విషయంపై అధికారులతో మాట్లాడి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు గాజుల వెంకటసుబ్బయ్య, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ అమ్మిశెట్టి కిషోర్‌కుమార్, గ్రామ సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి, జనసేన నాయకులు చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వేల్పుల రవిప్రసాద్, లీగల్ సెల్ ప్రతినిధి జయప్రకాష్, పార్టీ నాయకులు పీకా రాజు, కన్యధార తాతాజీ, తేజాప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డును తవ్వారు.. వదిలేశారు

- గుంతలతో అధ్వానంగా రహదారి
- ఇబ్బందులుపడుతున్న ప్రయాణికులు

బాపట్ల రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జీబీసీ రోడ్డు కమ్మ కల్యాణ మండపం ప్రధాన రహదారి నుంచి నాగేంద్రపురం, అసోదివారిపాలెం, మరుప్రోలువారిపాలెం గ్రామాల మీదగా కప్పలవారిపాలెం గ్రామం వరకు రోడ్డు గుంతలతో అధ్వానంగా ఉంది. సుమారు 10 నెలల క్రితం ఆ రోడ్డును బాగు చేసేందుకు కాంట్రాక్టర్‌లు తవ్వి వదిలేశారు. దీంతో గులకరాళ్ళు రోడ్డుపై లేచి ఉండటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు తవ్వి పది నెలలకు పైగా గడుస్తున్నా పనులు చేపట్టకపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ఆ రహదారిని బాగు చేసి వీలైనంత త్వరగా తారు వేయాలని ప్రజలు కోరుతున్నారు.


మరుప్రోలువారిపాలెంలోని రోడ్డుపై గులకరాళ్ళు తేలిన చిత్రం


నాగేంద్రపురం గ్రామ సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

కూటమి పాలనలో ప్రజాసంక్షేమం


సంక్షేమ కరపత్రాలు పంచుతున్న జిట్టా శ్రీనివాసరావు తదితరులు

బాపట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి పని చేస్తున్నట్లు 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు జిట్టా శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలోని భీమావారిపాలెంలో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటా తిరుగుతూ, దుకాణాల వద్దకెళ్ళి కరపత్రాలు పంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు డేగల వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి అందెల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ తర్వాత మిగిలింది బిగ్‌బాసే : కొల్లా

బాపట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వేల కోట్ల లిక్కర్ స్కాంలో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేయటంతో కేసులో అంతిమ లబ్ధిదారుని బండారం బట్టబయలై అన్నిఆధారాలతో అరెస్టు ఖాయంగా కనిపిస్తున్నదని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ మిథున్‌రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించటం ఆత్మవంచన అవుతుందన్నారు. ఎవరు ఆదేశాలతో మిథున్‌రెడ్డి లిక్కర్ స్కాంలో మాస్టర్‌మైండ్‌గా, సూపర్‌పవర్‌తో వ్యవహరించాడో ఆ బిగ్‌బాస్ ఎవరో ప్రజలకు ఇప్పటికే తెలిసినా న్యాయస్థానం ద్వారా నిగ్గు తేల్చి జైలుకు పంపించటం ఖాయమని కొల్లా పేర్కొన్నారు.

రామ్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

బాపట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక మెరైన్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రామ్‌నగర్ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. యజ్ఞ హాస్పటల్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెరైన్ సీఐ టి.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గుండె, స్త్రీల ఆరోగ్యం, ఎముకల నిపుణులు, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యసలహాలు ఇవ్వటంతోపాటు మందులు పంపిణీ చేయటం జరిగిందన్నారు. మెరైన్ ఎస్ఐలు టి.నాగశివారెడ్డి, ఎ.శ్రీనివాసరావు, వైద్య బృందం డాక్టర్ బెల్లకొండ శ్రీకాంత్, డాక్టర్ మాధవి, డాక్టర్ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొని రోగులకు సేవలందించారు.

చెరువులో దిగిన వ్యక్తి మృతి


గొరికపూడి జగదీష్

వేమూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుమర్రు గ్రామంలో చేపల చెరువులో పని నిమిత్తంగా వెళ్లిన గొరికపూడి జగదీష్ (30) చెరువులోకి దిగి మృతి చెందాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనలో పని నిమిత్తంగా వెళ్లిన వ్యక్తి ఊబిలోకి కూరుకుపోయి ఊపిరి ఆడక ప్రాణాలు పొగొట్టుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తంగా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్నేహ మ్యాక్స్ డిపాజిట్‌దారుల ఆందోళన

బాపట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపించి కోట్లాది రూపాయల డిపాజిట్‌లు సేకరించిన స్నేహ మ్యాక్స్ బోర్డు తిప్పేసినట్లు విశాఖపట్నంలో కేసు నమోదు కావటంపై జిల్లాలోని డిపాజిట్‌దారులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం చింతలపూడి గ్రామానికి చెందిన విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి కటికల శివభాగ్యారావు 2008వ సంవత్సరంలో స్నేహ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని ఏర్పాటు చేశారు. 12 శాతం వడ్డీ ఇస్తానని అనేక మంది దగ్గర డిపాజిట్‌లు సేకరించారు. గుంటూరులో కూడా ఈ సొసైటీకి రిజిస్ట్రేషన్ చేయించి అనేక కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరిచి డిపాజిట్‌లు సేకరించారు. బాపట్ల కేంద్రంగా సుమారు 150 మందికిపైగా డిపాజిట్‌దారుల నుంచి సుమారు 2 కోట్ల 50 లక్షల రూపాయలు డిపాజిట్ చేయించారు. ఇటీవల బోర్డు తిప్పేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న డిపాజిట్‌దారులు హైదరాబాద్ వెళ్ళి నిలదీయగా వైజాగ్‌లో భూములు ఉన్నాయని వాటిని అమ్మి తిరిగి చెల్లిస్తామని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం విశాఖపట్నంలోని దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి ఆరుగురిని అరెస్ట్ చేయటం చర్చనీయాంశంగా మారింది. దీంతో బాపట్ల పరిసర ప్రాంత డిపాజిట్‌దారులు ఆందోళన చెందుతున్నారు.

మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


ఏకోహౌస్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు

బాపట్ల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కొత్తబస్టాండ్ ఎకోహౌస్‌లో ఆదివారం మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ ఛైర్మన్ డాక్టర్ బి.శరత్‌బోస్ మాట్లాడుతూ శిబిరంలో 17 మంది రక్తదానం చేయగా 12మంది అవయవదానం, 11 మంది శరీర దానానికి ముందుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బొంగులూరు హరిప్రసాద్, బాపట్ల శాఖ ప్రధాన కార్యదర్శి గురజాల శ్రీనివాసరావు, ఎ.నాగవీరభద్రచారి, రాధాకృష్ణ, గుత్తి శివశంకర్, అల్లాడి రవికుమార్, కోలా పద్మ, కర్పూరపు మంజులత, కేశవులు, ఎం.సూరిబాబు, కరణం రవీంద్ర, జి.శాంతారాం, డాక్టర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సుబ్బారావు, ప్రసన్నాంజనేయులు, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

శకంబరి అలంకారంలో పోలేరమ్మ

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సూరేపల్లి శివారు వేమవరంలో పోలేరమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామదేవతను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పూజలను ఆలయ అర్చకులు నారాయణమూర్తి జరిపించారు.

బురకాయల అంకమ్మతల్లికి విశేష పూజలు

కర్లపాలెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం గ్రామ పంచాయతీలోని ఎంవి.రాజుపాలెంలో ఉన్న ఆట్లవారి కులదేవత శ్రీబురకాయల అంకమ్మతల్లికి ఆదివారం ఆషాఢ మాసం సందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామపెద్దల సహకారంతో భక్తులకు ఆలయప్రాంగణంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- విద్యార్థులు, చిన్నపిల్లలు కాల్వలో ఈత
- తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త


ఈత కొట్టేందుకు కాల్వలోకి దూకుతున్న విద్యార్థులు

రేపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సాగు కోసం పంట కాల్వలకు నీరువిడుదల చేయటంతో విద్యార్థులు, చిన్నపిల్లలు ఆదివారం శెలవు కావటంతో అరవపల్లి మెయిన్ కెనాల్లో పదులసంఖ్యలో చిన్నారులు ఇంట్లో తెలియకుండా కాల్వ వద్దకు వచ్చి గట్ల మీద నుంచి కాల్వలోకి దూకి ఈతలు వేశారు. కాల్వ ఉరవడిగా ప్రవహిస్తుండటంతో ఈతరాకపోతే చిన్నారుల పరిస్థితి గల్లంతే. తల్లిదండ్రులు శెలవు దినాల్లో తమపిల్లలు ఎక్కడకు వెళ్ళుతున్నారో నిఘా ఏర్పాటు చేసుకోవాలి లేకుంటే ప్రమాదం సంభవిస్తే చెప్పలేనంత బాధమిగులుతుంది. 5వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు శెలవుదినం కావటంతో రకరకాల విన్యాసాలు చేస్తూ కాల్వలోకి దూకి టూబులసాయంతో ఈతలు కొట్టారు. కాల్వలోకి దిగిఈతలు కొట్టాలంటే చిన్నారులకు చాలా ఇష్టం. అయితే సహాయంగా పెద్ద వారు ఏవరైనా ఉండి ఈతలు కొట్టిస్తే కొంతమేర ఇబ్బంది ఉండదు. ఇళ్ళ దగ్గర నుంచి ఆడుకుంటా నంటూ వెళుతూ కాల్వలోకి దిగి స్నానాలు చేస్తూ ఎంతో మంది విద్యార్థుల ప్రాణాలు పోయిన సంగతులు తెలుసు. తల్లిదండ్రులు పిల్లలపై దృష్టిసారించకపోతే కొంత ఇబ్బంది ఏర్పడే పరిస్థితి నెలకొంటుంది.


అరవపల్లి కాల్వలో ఈత కొడుతున్న చిన్నారులు, విద్యార్థులు

అరవపల్లి మెయిన్ కెనాల్ సైడ్‌కట్టలకు మరమ్మతులు


అరవపల్లి మెయిన్‌కెనాల్‌కు సైడ్ రివ్యూట్‌మెంట్ వేసిన చిత్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరవపల్లి మెయిన్‌కెనాల్‌కు ఇటీవల గండ్లు పడటంతో గుత్తేదారులు పనులు నిర్వహించారు. కాల్వలకు నీరు రావటంతో సైడ్ రివ్యూట్‌మెంట్‌లు నీటిలోకి కలిసిపోవటంతో 'ఆంధ్రజ్యోతి'లో 'పటిష్టత పైపైనే.. నాసిరకంగా కాల్వకట్టల మరమ్మతులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి నీటిపారుదలశాఖాధికారులు స్పందించి మెయిన్ కెనాల్ కాల్వకట్టలు కోతగురైన ప్రాంతంలో ఇసుకబస్తాలతో కట్టలను పటిష్టపరిచారు. దీంతో ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రెయినేజీని అధునికీకరించండి

- ఎమ్మెల్యేకు విన్నవించిన టీడీపీ నాయకులు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : రైతుల అవసరాలకు అనుగుణంగా మురుగు డ్రైనేజీని అధునీకరించాలని భట్టిప్రోలు టీడీపీ శ్రేణులు ఆదివారం ఎమ్మెల్యే ఆనందబాబుకు విన్నవించారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలుసుకుని కనగాల అప్‌ల్యాండ్ మురుగు డ్రెయిన్ భట్టిప్రోలు నుంచి గూడవల్లి గంగోలు వరకు 3 కి.మీ పరిధిలో ఉన్న మురుగు కాల్వ తూటికాడ, గుర్రపుడెక్కతో నిండిపోయిందని, వీటి కారణంగా గత ఖరీఫ్ సీజన్‌లో 3 వేల ఎకరాల మాగాణి భూములు ముంపునకు గురయ్యాయన్నారు. డ్రెయిన్ ద్వారా మురుగునీరు దిగువకు వెళ్లాలంటే కాల్వల్లో నిండిపోయి ఉన్న తూటికాడ, గుర్రపుడెక్క తొలగించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సాగునీటి శాఖ అధికారులకు, డ్రైనేజీ డీఈలకు సూచిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, పార్టీ నాయకులు యడ్ల జయశీలరావు, అంజిబాబు, డొక్కు శ్రీనివాసరావు, కుంచె వెంకటేశ్వరరావు, ఇర్ఫాన్ బేగ్, వెంకట్రావు, లోక్‌నాథ్ తదితరులు ఉన్నారు.


మురుగు డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే ఆనందబాబుకు విన్నవిస్తున్న టీడీపీ నాయకులు

షటిల్ బ్యాడ్మింటన్‌లో శ్రీమన్నారాయణ టీం ప్రథమస్థానం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో శ్రీమన్నారాయణ టీం ప్రథమస్థానంలో నిలిచింది. గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ మీట్ 50 + మెన్స్ డబుల్ విభాగంలో భట్టిప్రోలు ఏపీఎంగా పని చేస్తున్న శ్రీమన్నారాయణ, శీలం వినయ్‌కుమార్‌ల జోడిగా ఎస్.సింగారయ్య ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు జోడిపై ఫైనల్స్‌లో విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. విజయం సాధించిన ఏపీఎం జట్టును కార్యాలయ సిబ్బంది అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చెరుకుపల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కావూరుసబ్‌స్టేషన్‌కు సంబంధించి నడింపల్లి ఫీడర్ మరమ్మతుల సందర్భంగా నడింపల్లి, పొన్నపల్లి, ఆరేపల్లి, మత్తివారిపాలెం గ్రామపంచాయతీల పరిధిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని ఏడీఈ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం


కంటి పరీక్షలు నిర్వహిస్తున వైద్యులు

రేపల్లె, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో రోటరీక్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఇండియన్ రెడ్‌క్రాస్ రేపల్లె బ్రాంచ్ ఛైర్మన్ వసంతం వీరరాఘవయ్య అన్నారు. పట్టణానికి చెందిన దివంగత ఆకులపూర్ణ చంద్రరావు జ్ఞాపకార్థం కుమారుడు సత్యసాయి జ్యూయలర్స్ ఆకులసాయిరామ్ ఆర్థిక సహకారంతో రోటరీ క్లబ్, శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శుక్లాలు ఉన్నవారికి త్వరలో శంకర వైద్యశాలకు తీసువెళ్ళి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. అనంతరం వైద్యశిబిరానికి ఆర్థికంగా సహకరించిన ఆకుల సాయిరామ్ దంపతులను రోటరీ క్లబ్‌లు సన్మానించి మెమోంటోను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జీ.శేషాచల శ్రీనివాసరావు, గొట్టుముక్కల బాపారావు, టి.శ్రీరామకృష్ణ, వేపూరి సాయేశ్వరరావు, ఎంఎం సక్సేనా, రావి మురళీకృష్ణ, మల్లెల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీ రవిశంకర్‌కు మాతృవియోగం

- టీడీపీ నేత మురళీకృష్ణ మేనమామ కన్నుమూత
- మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే ఆనందబాబు


లక్ష్మీకాంతమ్మ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో కన్ను మూసిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం పరామర్శించారు. కొల్లూరుకు చెందిన ఈవోపీఆర్డీ మాకినేని రవి శంకర్ మాతృమూర్తి లక్ష్మీకాంతమ్మ (71) చికిత్స పొందుతూ గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. కొల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ మేనమామ అయిన పరుచూరి నరసింహారావు (91) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మురళీకృష్ణ స్వగృహంలో కన్ను మూశారు. ఇరువురు మృతి చెందిన సమాచారం అందుకున్న ఎమ్మెల్యే పార్థివ దేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయా కార్యక్రమాలలో మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, యలవర్తి కోటేశ్వరరావు, జొన్నలగడ్డ విజయబాబు, జీఎల్‌జీ భగవాన్, మేకా దివాకర్, పొదిలి ఎంపీడీవో గుత్తా శోభన్‌బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

- ఆర్థిక సాయం అందించిన జనసేన నేత


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

వేమూరు (చుండూరు), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : చుండూరు మండలం మోదుకూరు గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన ఎల్లంపల్లి వెంకటేశ్వర్లు (36) పాముకాటుకు మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం కూలీ పనులకు వెళ్లిన వెంకటేశ్వర్లు పాముకాటుకు గురికావడంతో చికిత్స నిమిత్తం పొన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర చికిత్స అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అంత్యక్రియలు నిమిత్తం ఆర్థిక సహాయం అందించమని కుటుంబ సభ్యులు కోరడంతో ఆదివారం జనసేన నాయకులు పోకల శ్రీనివాసరావు రూ.5 వేలు సహాయం అందించారు. కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొని వెంకటేశ్వర్లుకు సంతాపం తెలియజేసి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు.

‘ఉపాధి’లో మస్టర్ల మాయాజాలం

- స్థానికంగా లేకపోయినా ఇక్కడ హాజరు
- నేతల నుంచి అభ్యంతరాలు లేకుండా వారికి వాటాలు
- ప్రజావేదికల్లో పైవారికి సైతం మామూళ్లు
- మంత్రి రవికుమార్ దృష్టికి తెచ్చిన వెల్లలచెరువు వాసులు
- విచారణకు ఆదేశం

అద్దంకి, జూలై20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం అమలులో అవినీతి పెరిగిపోతోంది. వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా దొంగమస్టర్లకు అలవాటు పడ్డ క్షేత్రస్థాయి సిబ్బంది టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అదే పంథా కొనసాగిస్తున్నారు. గ్రామస్థాయి నాయకులను ప్రసన్నం చేసుకునేందుకు స్థానిక నేతలకు, వారి కుటుంబసభ్యులు పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేస్తున్నారు. ఇంతటితో ఆగకుండా వారినెలాగు నొరత్తకుండా చూశాము కదా అని, ఇష్టానుసారం వారు దొంగమస్టర్లు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఏనాడు ఉపాధి పనుల ముఖం కూడా చూడని వారికి, చిరు ఉద్యోగులు, ఇతర ప్రాంతాలలో ఉద్యోగాలు చేసే వారికి ఎప్పుడో చనిపోయిన పోయిన వారికి చోటామోటా నాయకులకు మస్టర్లు వేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో దొంగ మస్టర్లు వేసేందుకు అలవాటు చేసిన మండల స్థాయి సిబ్బంది, అధికారులు ఆపైనా ఏదో ఒకసాకు చెప్పి వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. వారి నుంచి మాముళ్లు పుచ్చుకుంటున్నారు..! ఇక జిల్లా స్థాయి నుంచి తనిఖీకి వచ్చారంటే ఖర్చుకు లేక్కే ఉండదు. సామాజిక తనిఖీ సందర్భంగా వసూళ్ల పర్వానికి అంతే లేకుండా పోతోంది. సామాజిక తనిఖీ ప్రజావేదికకు వచ్చే జిల్లాస్థాయి అధికారికి అక్షరాల లక్ష రూపాయలు ముట్టజెప్పాల్సిందే..! ఇక సామాజిక తనిఖీ చేసే సిబ్బంది, ఇతర సిబ్బంది కి మరో లక్ష రూపాయలు ఖర్చు షరా మాములే..! సామాజిక తనిఖీకి ప్రభుత్వం నుండి ప్రతి మండలానికి రూ.2 లక్షల నిధులు విడుదల చేస్తోంది. అయితే సామాజిక తనిఖీ చేసే సిబ్బంది క్షేత్రస్థాయిలో అవకతవకలు గుర్తించినా, స్థానికంగా ఫిర్యాదులు అందినా అవి మండల స్థాయి లో జరిగే ప్రజావేదికలో మాత్రం చర్చకు రావు. ఒకవేళ సిబ్బంది ఒకింత నిజాయితీతో అవకతవలను ప్రజా వేదిక దృష్టికి తీసుకు వచ్చినా ఉన్నత స్థాయి అధికారులు మరి కొంత అదనపు సొమ్ము తీసుకొని ఆల్ కరెక్ట్‌గా ధ్రువీకరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. మండల స్థాయిలో ఉపాధి పనులు పర్యవేక్షణ చేసే అధికారులు ఇక్కడిక్కడే ఒక మండలం నుండి మరో మండలానికి బది లీ అవుతూ దశాబ్దాల తరబడి పనిచేస్తూ ఒకరికొకరు సహకరించుకుంటు న్నారనే విమర్శలు బలంగా వస్తున్నాయి. అద్దంకి నియోజక వర్గంలో ప్రతి రోజు సరాసరిన 20 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వారిలో కనీసం ఐదారు వేల మందికి ప్రతిరోజు దొంగ మస్టర్లు పడుతున్నా యని అంచనా ఉంది. ఈ విషయాలను ఇటీవల సంతమాగులూరు మండలం వెల్లలచెరువులో మంత్రి రవికుమార్ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం లో పాల్గొన్న సమయంలోనే స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. అదే సమయంలో ఇతర మండలాలలోనూ పలు సందర్భాలలో మంత్రి రవి కుమార్ దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో రవికుమార్ ఉపాధిహామీ పథకంలో చోటు చేసుకుంటున్న అవకతవకల పై విచారించాల్సిందిగా పీడీ విజయలక్ష్మిని ఆదేశించినట్లు తెలుస్తోంది. విచారణ మొక్కుబడిగా కాకుండా అన్ని మండలాలలో పూర్తి స్థాయిలో చేపడితే ఉపాధిలో అవినీతి వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు. ప్రజావేదికలో మసి పూసి మారేడు కాయ చేసినట్లు విచారణలోనూ మాయాజాలం ప్రదర్శిస్తారో లేక నిజాయితీగా విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఆవోపాతో విద్యార్థులకు చదువుల పండుగ

చీరాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఆవోపా ఆధ్వర్యంలో చీరాలలో చదువుల పండుగ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, ఆర్థిక సహకారంతో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఆదివారం కిరాణా మర్చంట్ అసోసియేషన్ మండపంలో ఆవోపా ఆధ్వర్యంలో 250 మంది విద్యార్థులకు రూ.25 లక్షల విలువైన సాయం అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 109 మంది విద్యార్థులకు రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారం, 80 మందికి వడ్డీలేని విద్యా రుణాలు, 64 మందికి ఉచిత చేయూత పురస్కారాలు, 40 మందికి వడ్డీలేని ఉపాధి రుణాలు, ఐదుగురు విద్యార్థులకు వడ్డీలేని రుణంగా ల్యాప్‌ట్యాప్‌లు అందించడం ఆనందించదగిన అంశమని చెప్పారు. అలాగే విద్యార్థులు కూడా అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతంగా రాణించాలని సూచించారు. అంతకుముందు వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామంలో పందిళ్లమ్మతల్లి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో కొత్త మాసు శివరంగనాయకులు, ముప్పల వెంకట రమణరావు, బొలిశెట్టి మురళీకృష్ణ ప్రేమ్, వలివేటి మురళీకృష్ణ, శ్యామసుందర రావు, వెంకట రామయ్య, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

నేటి నుంచి నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు

పంగులూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పు కొప్పెరపాడు పీఏసీఎస్ గోడౌన్ వద్ద 21న సోమవారం నుంచి నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు చేపట్టనున్నట్లు పంగులూరు పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పంగులూరు మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రంలో గోడౌన్‌లు నిండినందున పొగాకు కొనుగోలు కేంద్రం కొప్పెరపాడులోని పీఏసీఎస్ గోడౌన్‌వద్ద ఏర్పాటు చేసినట్లు సీఈవో లక్ష్మి తెలిపారు. మార్క్‌ఫెడ్ కేంద్ర కార్యాలయం నుంచి కొనుగోలు కేంద్రంలో పొగాకు బేళ్ల కొనుగోలుకు సమాచారం అందిన రైతులు తూర్పు కొప్పెరపాడు కేంద్రానికి పొగాకు బేళ్లు తీసుకురావాలని సీఈవో నాగబోయిన లక్ష్మి రైతులకు సూచించారు.

అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

మార్టూరు, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలో అంకమ్మ శక్తిక్షేత్రంలో ఆషాడమాసం చివరి ఆదివారం సందర్భంగా ఆలయంలో అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అంకమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వడపప్పు, పానకంతో పొంగళ్లు, ఆషాడం సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన పూజారి ఆళహరి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కర్పూరపు రామారావు, కర్పూరపు రమేష్, దామర్ల బసవరాజు, వెంకటేశ్వరరావు తదితరులు దంపతులతో కలిసి వచ్చి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

పోలేరమ్మ అమ్మవారికి ఆషాడం సారె

చినగంజాం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధి లోని మూలగానివారిపాలెం గ్రామంలో పోలేరమ్మ అమ్మవారికి ఆషాడ సారె కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, గ్రామానికి చెందిన ఆడపడుచుల ఆధ్వర్యంలో ఆషాడ మాసం సారె కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాక్టర్‌లో చలిమిడి, అరటికాయలు, పసుపు, కుంకుములు, గాజులు, చీర, జాకెట్ తదితర వాటిని ఉంచి గ్రామ పురవీధులలో మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ మహిళా భక్తులు ఊరేగింపుగా పోలేరమ్మ అమ్మ వారి ఆలయానికి తీసుకొని వెళ్లారు. ఈ సందర్భందగా ఆలయ పూజారి అమ్మ వారిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అషాడ సారెను సమర్పించారు. తదనంతరం గ్రామంలోని మహిళలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


అమ్మవారికి సారె తీసుకొని వెళ్తున్న మహిళలు

నిన్న నీటితో కళ కళ.. నేడు వెలవెల..


ఇరవై రోజుల క్రితం నీటితో కళకళలాడుతున్న కలవకూరు చెరువు, చేపలు పట్టేందుకు నీరు ఖాళీ అయిన చెరువు

అద్దంకి, జూలై20(ఆంధ్రజ్యోతి): చేపల పట్టేందుకు చెరువులు ఖాళీ చేస్తున్నారు. ఇటీవల బల్లికురవ మండలం అంబడిపూడి చెరువును ఖాళీ చేయగా ప్రస్తుతం అద్దంకి మండలం కలవకూరు చెరువును ఖాళీ చేశారు. ప్రభుత్వాలు ఏవైనా అధికారంలో ఎవరున్నా చెరువులు ఖాళీ కావడం మాత్రం షరా మాములు గానే మారాయి. 20 రోజుల క్రితం చెరువు నిండా నీటితో కళకళ లాడిన చెరువులు చేపలు పట్టేందుకు నీటిని బయటకు పెట్టడంతో పూర్తిగా ఖాళీ అయ్యాయి. ఇలా మరికొన్ని చెరువులను కూడా ఖాళీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. సాగర్ జలాలలో చెరువులను నింపి, ఇప్పుడు చేపలు పట్టేందుకు నీటిని బయటకు వృథాగా వదలడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతా స్థానికంగా ఉండే నేతల కనుసన్నలలో సాగుతుండడంతో నోరెత్తేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువులను ఖాళీ చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగానికే పదవీ విరమణ... ప్రజా సేవలకు కాదు

పర్చూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగానికే వివరమణ ఉంటుందని, ప్రజా సేవకు విరమణ ఉండదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ కలెక్టర్ కరారి రమేష్ నాయుడు అన్నారు. స్థానిక శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో రాష్ట్ర సచివాలయంలో అడిషనల్ సెక్రటరీగా మున్సిపల్ అండ్‌అర్బన్ డెవలెప్‌మెంట్‌లో ఉద్యోగం నిర్వహించి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉప్పుటూరి మురళీకృష్ణ పౌరసన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ, లక్ష్మీ దంపతులకు బాల్యమిత్ర బృందంతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేసే వారికి ప్రజల్లో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. సమైక్య ఆంధ్ర ఉద్యమంలో మురళీకృష్ణ చేసిన కృషి ఎనలేనిదన్నారు. శారదా విద్యాసంస్థల డైరెక్టర్ క్రిష్ణంశెట్టి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ పర్చూరు గ్రామాభివృద్ధిలో మురళీకృష్ణ చేసిన కృషిని అయన కొనియాడారు. యువత అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. అనంతరం మురళీకృష్ణ, లక్ష్మీ దంపతులను గ్రామస్థులు, మిత్రులు గజమాలతో ఘనం గా సత్కరించారు. కార్య క్రమంలో డీఎస్‌వో తాటి ప్రసాద్, కఠారి సురేంద్రబాబు, కారుమూరి సీతారామయ్య, కోటా హరిప్రసాద్, డీఎస్పీ ఉప్పుటూరి రవిచంద్ర, సీఐలు అకుల అశోక్‌కుమార్, చింతా రవి, మంగళగిరి కోటేశ్వర రావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, రంగిశెట్టి ఆంజనేయులు, ఒగ్గిశెట్టి నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.


మురళీకృష్ణ, లక్ష్మీ దంపతులను సన్మానిస్తున్న నిర్వాహకులు

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని ఉప్పుటూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వర, చెన్నకేశవస్వామి వార్ల ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్ నగర్ జిల్లా వికారాబాద్‌లో న్యాయాధికారిగా పనిచేస్తున్న లక్ష్మీ, మురళీకృష్ణ దంపతులు స్వామివార్లను దర్శించుకొని పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దామా నాగేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో వీధులు జలమయం

అద్దంకి, జూలై20 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రాంతంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 3 గంటల నుంచి ప్రారంభమైన భారీవర్షం పలు విడతలుగా రాత్రి పొద్దు పోయే వరకు కురిసింది. దీంతో అద్దంకి పట్టణంలో నామ్ రోడ్డుపై సైతం వర్షపు నీరు ప్రవహించింది. సైడ్‌డ్రైన్లు పొంగి ప్రవహించాయి. మూడు రోజుల క్రితం భారీ వర్షానికి పదునెక్కిన భూములు ఆదివారం కురిసిన వర్షంతో పంట పొలాలలో ప్రవహించాయి. దీంతో వాగులకు సైతం నీరు చేరింది. గత నెల రోజులుగా ఎండలతో ఇబ్బంది పడగా వర్షాలతో వాతావరణం చల్లబడింది. పొలాలు పదునెక్కడంతో పంటల సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. మొక్కజొన్న విస్తారంగా సాగు చేసే అవకాశం ఉంది. ఇప్పటికే సాగుచేసిన మొక్కజొన్న, నువ్వు పంటలకు జీవం పోసినట్లు అయ్యింది.

చీరాల : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రధాన రహదారులు సైతం వంకలను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణాలు సాగించే వాహనదారులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర అసహనం చెందుతున్నారు. కొన్ని గంటలపాటు రోడ్లు సైతం కనుచూపు మేర కనబడిన దాఖలాలు లేవు. పట్టణంలో డ్రయిన్‌లు నిండి వ్యర్థ జలాలు రోడ్డెక్కాయి. ఈపూరుపాలెం ఎస్‌బీఐ సెంటర్, మార్కెట్ సెంటర్‌తో పాటు పలు గృహాల్లో కూడా మండల పరిధిలో నీళ్లు ఇళ్లల్లోకి చేరాయి. జాండ్రపేట. వేటపాలెం ప్రాంతాల్లో రహదారులు గుంతలగా ఉండడంతో వాహనాలు కాస్త పట్టుతప్పుతున్నాయి.

ఇంకొల్లు : ఇంకొల్లులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లన్ని జలమయమయ్యాయి. ఇస్లాంపేటలో వర్షపు నీరు ఇళ్లలోకి నీరు చేరింది. మురుకాల్వలు, వర్షపునీరు ఏకమై రోడ్లపై పారి వాహన దారులు పోలేనంతగా ప్రమహించాయి.రాత్రి 8 గంటల వరకు ఎడతెరపులేకుండా వర్షం పడుతూనే ఉంది.ప్రజలు బయటకు రాలేక ఇళ్లకే పరిమితమయ్యారు.

పర్చూరు : గాలి దుమారం ఎడతెరపు లేకుండా కురిసిన భారీ వర్షంతో పర్చూరులో రోడ్లు జలమయం అయ్యాయి. ఒక్కసారిగా భారీ కుండపోతగా వర్షం కురవడంతో ప్రధాన రహదారులపై భారీగా నీరుచేరింది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పర్చూరు - చీరాల రోడ్డులో వాగులన తలపించే విధంగా నీరు నిలిచి పోయింది.


చీరాలలో కురుస్తున్న వర్షం


ఇంకొల్లులో వీధుల్లో నిలిచిన నీరు

వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

పంగులూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలుకు చెందిన ఉపాస్ వైద్యశాల వైద్యులు డాక్టర్ జగదీష్ అన్నారు. మండల కేంద్రమైన పంగు లూరులో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాస్ వైద్యశాల వారి సహకారంతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ జగదీష్‌బాబు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పి.జయవర్ధన్ మరియు కంటి వైద్యనిపుణులు పాల్గొని 340 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. 22 మంది రోగులకు మెరుగైన వైద్యం అవసరమని గుర్తించి ఎన్‌టీఆర్. వైద్యసేవాట్రస్ట్ ఉపాస్ వైద్యశాలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో ఉపాస్ వైద్యశాల జీఎం ఆనంద్, పీఆర్‌వో తాళ్లూరి రామాంజనేయులు, విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పూసపాటి సాంబశివరావు, కోళ్లపూడి సురేష్‌బాబు, అధ్యక్షులు చేబ్రోలు రవిచంద్ర ఆచారి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పరవళ్లు.. నారుమళ్లు !

(5వ పేజీ తరువాయి)

శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సాగర్ నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 247 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. సాగర్‌లో నీటి నిల్వలు పెరుగుతుండటంతో కుడి కాలువ అయకట్టులో సాగుకు భరోసా వచ్చింది.

రాయితీ విత్తనం మాటేంటి?

సాగర్ కుడి కాల్వకు సాగు నీటిని విడుదల చేసేందుకు ఒకవైపు జలవనరుల శాఖ సమాయత్తమవుతుండగా.. వ్యవసాయ శాఖ మాత్రం సాగుపై ఇంకా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికే వరి విత్తనాల నిల్వలు సిద్ధం చేసి.. రైతులకు రాయితీపై సరఫరా చేయాల్సి ఉంది. కానీ, వ్యవసాయ శాఖ విత్తన పంపిణీ ప్రారంభించకపోవడంతో ప్రైవేట్ వ్యాపారుల నుంచి రైతులు విత్తనం కొనుగోలు చేస్తున్నారు. దీంతో విత్తన రాయితీని వారు కోల్పోతున్నారు. జిల్లాలో 1,33,400 ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయ శాఖ అంచానా వేసింది. ఈ మేరకు వరి విత్తనం సిద్ధం చేయలేదు. గతేడాదీ వరి విత్తన కొరత వెంటాడింది. విత్తనం సకాలంలో లభించక రైతులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. జిల్లాలో 26,825 క్వింటాళ్ల వరి విత్తనం అవసరమవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. బీపీటీ-5204, జేజీఎల్ -354, కేఎన్‌ఎం-1638, ఎన్‌ఎల్‌ఆర్ -34449, అంకుర్ సోనా, హెచ్‌ఎంటీ, బీపీటీ -2782, బీపీటీ-2846 రకాల విత్తనాలు సరపడా నిల్వలు డీలర్ల వద్ద ఉంచాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారే తప్ప.. క్షేత్ర స్థాయిలో చర్యలు కానరావడం లేదు.

జడ్పీ ‘ఫైల్స్’!

(5వ పేజీ తరువాయి)

వెల్లడించింది. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ మెటీరియల్‌ను తెనాలికి చెందిన ప్రముఖ ప్రింటర్స్ కారు చౌక ధరకు ముద్రించి.. పేద పిల్లలకు అందజేస్తున్నారు.

9 నెలలు దాటినా

విద్యాజ్యోతి మెటీరియల్ టెండర్లు ముగిసి దరిదాపుగా తొమ్మిది నెలలు దాటింది. 35 వేల పుస్తకాలు పంపిణీ చేసినందుకు గాను సుమారు గా రూ.80 లక్షలు వరకు బిల్లులు చెల్లించాలి. జడ్పీ అధికారులు మాత్రం ఏదో ఒక కారణం చెబుతూ కాలయాపన చేస్తున్నారు.

పర్సంటేజ్ కోసం పట్టు?

కొన్ని కీలకమైన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్ ఉండటం వెనుక అసలు సంగతి వేరే ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారులు తమకు రావాల్సిన పర్సంటేజ్ ఫైనల్ అయిన తర్వాతే కొన్ని ఫైళ్ల పరుగులు పెడుతున్నట్లు చెబుతున్నారు. మొత్తమ్మీద విద్యా జ్యోతి ఫైల్ కూడా అందుకే పెండింగ్‌లో ఉందన్న ప్రచారం జరుగుతుంది.

అవీ..ఇవీ..

ఉచిత గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన

మార్టూరు, జూలై20 (ఆంధ్రజ్యోతి): మార్టూరు పట్టణంలో గుంటూరు వారి అపార్ట్‌మెంట్ ఆవరణలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హెల్ప్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండెచికిత్స వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. డాక్టరు నాగకిరణ్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మందికి విజయవాడలో మెరుగైన పరీక్షలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాదాల సాంబశివరావు, జూష్టి వెంకట మోహనరావు, శానంపూడి లక్ష్మయ్య, చెరుకూరి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ పురోహిత్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఏకగ్రీవమైన నూతన కార్యవర్గం

దేశాయిపేట(చీరాల), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : దేవాంగ పురోహిత్ పరిషత్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. వేటపాలెం మండలం దేశాయిపేట గ్రామం ఆమోదగిరిపట్నం సాయి బాబా కల్యాణ మండపంలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులుగా చల్లా రామారావు, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునరావు, బాలశంకర్, రాముడు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణరావు, సహాయ కార్యదర్శిగా మల్లేశ్వర సిద్ధాంతి, హనుమంతురావు, కోశాధికారిగా మహదేవమూర్తి, ఏకాంబరం, దుర్గాప్రసాద్, అధికార ప్రతినిధిగా నాగప్రసాద్, యువజన విభాగం ప్రతినిధిగా రాఘవ, సభ్యులుగా పరమేశ్వరయ్య, మోహన్‌బాబు, విఘ్నేష్ ప్రమాణ స్వీకారం చేశారు.

యువత మాదకద్రవ్యాల బారిన పడొద్దు

ఇంకొల్లు, జూలై 20,(ఆంధ్రజ్యోతి) : యువత మాదకద్రవ్యాల భారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఇంకొల్లు ఎస్సై సురేష్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువతకు డ్రగ్స్‌తో వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా చిన్నారులు డ్రగ్స్ సేవించినట్లు మీ దృష్టికి వస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ఇప్పటికే అనేక మందిని గుర్తించి కౌన్సెలింగ్ చేసి యువతలో మార్పు తెచ్చామన్నారు. మండలంలో మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో నివారించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాలను ఎక్కడైన విక్రయిస్తే 1972 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందజేయాలన్నారు.

24న ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

ఇంకొల్లు, జూలై 20,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మారుతీ ఐటీఐ కళాశాలలో ఈ నెల 24న గురువారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధికారి పి.ప్రణయ్ తెలిపారు. ప్రముఖ కంపెనీలలో 300పైగా ఉద్యోగావకాశాలు ఉండగా 18-30సంవత్సరాలు మధ్య వయస్సు కలిగి ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ విద్యార్హత కలిగిన వారికి రూ.12,000 నుంచి రూ.20,000 వరకు జీతం ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు 6302764962, 9988853335 నంబరులో సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపల్ కారుమూడి శ్రీనివాసరావు కోరారు.

డ్రోన్ సహాయంతో జూదరుల అరెస్టు

ఇంకొల్లు, జూలై 20,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం గ్రామ శివారు పొల్లాల్లో పేకాట ఆడుతున్న పదిమందిని ఆదివారం డ్రోన్ సహాకారంతో అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,2100 నగదు, 9 సెల్‌ఫోన్లు, 4 మోటర్‌బైకులు సీజు చేసినట్లు సురేష్ తెలిపారు. మండలంలో పేకాట నిర్వహించే శిబిరాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. పేకాట ఆడేవాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూనియర్ ఎన్‌టీఆర్ స్ఫూర్తితో అన్నదానం

చీరాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సినీ నటులు జూనియర్ ఎన్టీఆర్ స్ఫూర్తితో అన్నదానం ప్రారంభించినట్లు ఎన్‌టీఆర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అన్నారు. ఆకలితో ఉన్న నిరుపేదలకు అన్నదానం చేసేందుకు పూనుకున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే ఆదివారం పట్టణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఇన్‌చార్జ్ సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు సేవలు

అద్దంకి, జూలై20(ఆంధ్రజ్యోతి): పొదిలి డిపో నుండి గుంటూరుకు అద్దంకి, రేణింగవరం మీదుగా సోమవారం నుంచి ఎనిమిది ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులోకి తెస్తున్నట్లు పొదిలి డిపో మేనేజర్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు, 6-30, 8-00, 10-00, మధ్యాహ్నం 12-30, 2-00, సాయంత్రం 3-30, 5-30 గంటలకు పొదిలిలో బయలుదేరి దర్శి, ముండ్లమూరు, అద్దంకి, రేణంగివరం మీదుగా గుంటూరు చేరకుంటాయి. తిరుగు ప్రయాణంలో గుంటూరులో ఉదయం 5-00, 8-45, 10-15, 11-45, మధ్యాహ్నం 1-45, సాయంత్రం 4-15, 5-45, 7-15 గంటలకు బయలుదేరి అద్దంకి మీదుగా పొదిలి చేరకుంటాయన్నారు. అదనంగా పొదిలి డిపో నుంచి గుంటూరుకు 8 ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపనుండటంతో అద్దంకి ప్రాంత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా మారనుంది.

తిమ్మాయపాలెంలో గోమాతకు సీమంతం


తిమ్మాయపాలెంలో ఆవుకు సీమంతం చేస్తున్న మహిళలు

అద్దంకి, జూలై20 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని తిమ్మాయ పాలెంలో గోవుకు ఆదివారం సీమంతం చేశారు. అల్లంనేని పూర్ణచంద్రరావు, పద్మజ దంపతులు తమ వ్యవసాయ క్షేత్రంలో గోమాతకు మహిళలు కుంకుమ, పూలు, చీరలు, గాజులు అందజేసి సీమంతం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుడి అనుమానస్పద మృతి

- ఆలస్యంగా వెలుగులోకి
- కేసు నమోదు చేసిన పోలీసులు

వేటపాలెం (చీరాల), జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం విఘ్నేశ్వర కాలనీకి చెందిన ఆర్‌ఎంపీ వైద్యులు కృష్ణారావు(62) అనుమానస్పద స్థితిలో ఇంట్లో మృతి చెందాడు. మృతునికి ఇరువురు కుమార్తెలకు వివాహమైంది. కాగా భార్యతో సుమారు నెలక్రితం వివాదం కావడంతో, ఆమె దూరంగా ఉండడంతో ప్రస్తుతం ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. అయితే ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికుల సమాచారం మేరకు ఎస్సై జనార్ధన్ ఇంటి తలుపులు తెరచి పరిశీలించగా కృష్ణారావు మృతి చెంది ఉన్నాడు. ఘటన జరిగిన సుమారు ఐదు రోజులు అయినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు.